

మీరు నన్ను ప్రేమిస్తున్నట్లయితే,
మీకు నిజంగా ప్రేమ ఉంటే, ఆ ప్రేమ
అత్యున్నతమైన ప్రేమ అయితే,
ఆ ప్రేమ, "రండి, వాడుకోండి!
నన్ను ఉపయోగపెట్టుకోండి" అని అంటుంది.
ఇంతకు ముందు కూడా నేను
ఈ మాట చాలాసార్లు చెప్పాను.
మీరు నన్ను ఉపయోగించుకోండి,
ఉపయోగపడటానికి నేను సిద్ధంగా ఉన్నానని!
రండి నన్ను ఉపయోగించుకోండి,
ఉపయోగపడటానికి నాకు ఏ భయమూ లేదు.
మీకు గనుక సామర్థ్యముంటే, ధైర్యం ఉంటే,
నన్ను ఉపయోగించుకునే సమర్థత ఉంటే
పూర్తిగా ఉపయోగించుకోండి.

శ్రీసచ్చిదానంద సద్గురు సాయినాథ్ మహరాజ్ కీ జై! సద్గురు శ్రీసాయినాథుని శరద్బాబూజీ కీ జై!

సత్సంగానికి పునాది ప్రేమ. అది అందుకు ఇందుకు అని కాదు.
ఒకరిని (సద్గురువును) చూసినపుడు ఎందుకో మనసులో తెలియని
ప్రేమ. ఆయన దగ్గర కూర్చున్నా, ఆయన గురించి ఆలోచించినా
మనస్సులో తెలియని ఆనందం కలుగుతుంది. అదేమిటో తెలియదు.
ఎందుకు వస్తుందో తెలియదు. ఏదో తెలియని భద్రత.
'నా' జీవితాన్ని ఆయన చూసుకుంటాడు' అనే భద్రత.
ఎందుకు చూసుకుంటాడో తెలియదు.
మనలో ఏం అర్హతలున్నాయని చూసుకుంటాడో తెలియదు.
దీని ద్వారా ప్రేమ కలుగుతుంది. ఆయన గురించి వినాలి.
ఆయనను చూడాలి. ఆయనకు ఇష్టమైన రకంగా ఉండాలి.
అనే తపన బయలుదేరుతుంది. ఆ తపనకు
ప్రతి రూపంగానే మనం సత్సంగానికి వెళతాం.



# కృప

శ్రీరామనవమి సంచిక

స్పష్టత.... నిర్దిష్టత...

అద్భుతమైనటువంటి సద్గురువు దొరికారు.

బాబా లాంటి సద్గురువు దొరికాక,

నన్ను మించిన అదృష్టవంతుడు లేడు.

నాకు దొరికినంత పెన్నిధి ఇంకెవ్వరికీ దొరకలేదు
అనే భావం. ఎవరికైనా మనసులో నిజంగా ఉంటే
వాడు ఎవ్వరినీ చూసి ఈర్ష్యపడడు.
ఎందుకు ఈర్ష్య పడతాడు?
బాబా కంటే గొప్ప పెన్నిధా?
అంతకంటే గొప్ప అదృష్టమా?
అంతకంటే గొప్ప భాగ్యమా?
ఆయనే మనకు
దొరికినపుడు ప్రక్కన వీళ్లను



చూసి, వాళ్ళను చూసి అసూయ పడాల్సిన అవసరం మనకు ఏంటి?

కాబట్టి బాబా పట్ల ప్రేమ పెంచుకోవడం, బాబాకు దగ్గరవడం

చేస్తే అసూయ, ద్వేషాలు కూడా పోతాయి.

- శ్రీబాబూజీ

గురుబంధువుల్లారా! ఏమిటి ఈ గురుస్తుతి - ఎందుకీ ప్రస్తుతి అని సందేహం కలిగింది కదూ! కడజాతిలో కడజాతివాడిని నేను! ఈ జాతి మోకరిల్లిన ఒక మహాత్ముని జీవితాన్ని అక్షరరూపంలో అందించేందుకు నాకెట్టి అర్హత, అనుకూలత లేవు. ప్రతికూలతలకు ప్రతినిధిని నేను! పతిత పావనమన్నారు కదా 'గురుమహిమ'ను. ఆ పతితాథముణ్ణి నేను. నా గురువు శరశ్చంద్రుడు అనుగ్రహనందనుడు. విఘ్నేశ్వర ప్రార్థన నాకు రాదు. విఘ్నము నాకు లేదు. ఎంచేతనంటే నా గురువుకు తెలిసిందల్లా ఒక్కటే. అనుగ్రహము - ఆశీర్వాదము. ఆయన చెంతన చేరినవారికల్లా సదా ఆనందము. ఇంకెక్కడిది విఘ్నము. నా గురువు నాకు సరస్వతి. నా బోంట్లకు సరస్వతి గోచరమయ్యే వీలున్నదా! నా గురుచంద్రుడు విజ్ఞాన సారస్వతము. మూర్తీభవించిన జ్ఞానము. ఇక నా కులదైవము - కడజాతి వాడిదే కులమో అది నాది. నా వంటి వారకు గురువే దైవము కదా! నా తల్లి, తండ్రి, దైవము నా గురువే!

పెరియవర్, నడమడం దైవం, పెద్దస్వామి, నడయాడే దైవం, నడిచి వచ్చిన బ్రహ్మపదార్థం అంటూ వేనోళ్ల కొలువబడిన కంచి పరమాచార్యులు శ్రీ చంద్రశేఖర సరస్వతి స్వామివారు ఒక విజ్ఞాన సర్వస్వం. మహాత్ముల చరిత్రలే మన జీవితాలకు మార్గనిర్దేశనాలు. వారి ఆచరణాత్మక జీవన విధానాలే మనకు అనుసరణీయాలు. కంచి పరమాచార్యుల పేరు వినగానే గుర్తొచ్చేది వారి నిరాడంబరత, వారి త్యాగం, సర్వజనాదరణం, ముముక్షు మార్గదర్శనం, ఆర్ష ధర్మరక్షణం, అనుగ్రహవీక్షణం, తపోమయ జీవనం, నియమ నిష్ఠా వర్తనం, స్వధర్మబోధనం... ఇలా ఎన్నో.

పూజ్యశ్రీ సాయినాథుని శరత్‌బాబూజీ సంపాదకీయంలో వెలువడ్డ 'సాయిపథం' పత్రిక ఒక ఆధ్యాత్మిక రచనా మణిమకుటం. వారు సంధించిన అక్షర పాశుపతాస్త్రాలు ప్రజల అజ్ఞానాంధకారాలను పటాపంచలు చేసిన జ్ఞానశస్త్రాలు. గురుచరణదాసులకు అవే శాస్త్రషట్కాలు, పురాణేతిహాసాలు. 'సజ్జన హృదయపీఠాధిపతి కంచి పెద్దస్వామి' అంటూ సద్గురుచంద్రులు శ్రీబాబూజీచే కీర్తించబడిన స్వామివారి జీవిత విశేషాలను మీ ముందుకు తీసుకొస్తుంది కేవలం 'గురుకృప' మాత్రమే. మహాత్ముడు నిత్యశిశువు. అందుకే వారి జీవితాలు ఎప్పుడూ నిత్యనూతనమే! ఆచారాలు కాలం చెల్లవచ్చేమో కానీ ఆచార్యుల 'ఆచరణ'లు మనందరికీ ఉద్దీపనాలు, ఉత్ప్రేరకాలు అనడంలో అతిశయోక్తి లేదు.

(సశేషం)




ఎంత రసమయంగా ఉంది, నీ నామస్మరణలో నేను పొందే రసాన్ని నేను ఎంతగానో ఆస్వాదిస్తున్నాను! నేను పొందే ఆ పారవశ్యానుభూతి అన్ని రుచికరమైన పదార్థాలలోని రసానికన్నా చాలా గొప్పది! అంటూ ఆయన చాలా రుచికరమైన పదార్థాల పేర్లను వరసగా చెప్పి, వీటిలో ప్రతి ఒక్కదానికన్నా రాముని నామం రుచికరంగా ఉందని చెప్తారు. నిజానికి వాటన్నింటినీ కలిపినా దానికన్నా రాముని నామం రుచిగా ఉందని చెప్తారు. మనం ఆ పద్యాన్ని పూర్తిగా అర్ధం చేసుకుంటే మనం రుచికరమైన పదార్ధాలను చూసినపుడు మనకు ఈ విషయం గుర్తుకు వస్తుంది. ఈ పదార్ధాలన్నీ రుచికరమైనవే కానీ వీటన్నింటికన్నా మన సద్గురువు పేరు ఇంకా రుచిగా ఉంటుంది. ఈ విధంగా మన జీవితంలోని ప్రతి అంశాన్ని మన సద్గురువుతో ముడిపెట్టుకోగలం.

## గురుకృపాలహరి

సద్గురు చరణ కమలాలే సర్వులకు జగద్రక్ష. సద్గురు స్వరూపం లేక ఈ జీవితానికి ప్రాణం లేదు. గురుదేవా! మీ అనుగ్రహ వర్షమే ఈ (మా) జీవితాలకు ప్రాణాధారము. మీ రూపమే మాకు శక్తి. మీ నామమే మాకు పరమమంత్రము. మీ అడుగుల జాడలే మాకు సచ్చరితలు. మీ బోధలు మాకు అజ్ఞానాంధాకారాలకు పటాపంచలు చేసే వెలుగు వాకిట్లు. అనుగ్రహమే అవతారం ధరిస్తే అందుకు ఆకృతి మీరు. ఆనందం వెల్లివిరిస్తే వెల్లువలా మాపై వర్షించిన జడివానే మీరు. మా ఈ ప్రతీపదం మీరు, మా గుండెల లయకారులు మీరు. మీ కరుణావరణం ఆలయమైతే – ప్రభవించిన మీ రూపం అందు 'మూలం' (దైవం) అయితే వెలిగేందుకు మేం దీపం అవుతాం. కను'పాప'గా మము కాపాడిన కరుణాసింధువు మీరైతే మీ కీర్తిని ఎలుగెత్తే 'కవనా'లము మేమవుతాము. దీనబంధూ! దయాసింధూ – మీ చరణాల చెంత మాకింత చోటివ్వండి. భవసాగరమన్న సంసారం – మీ చెంతన చేరితే మీ పూజకు 'సుమహారం' అవడం తథ్యం! ప్రభూ! మానవ జీవిత లక్ష్యమేమంటే 'జన్మరాహిత్య'మన్నారు కొందరు – కాదు కాదు 'గురులాలిత్య'మని అనుభవమవుతోంది. సద్గురూ! శృతి, స్మృతుల చింత నాకేల! నీ పదకమలములయందు నేనున్న వేళ గురుదేవా. మీ చరణాల చెంత మాకింత చోటివ్వండి. మీ విజ్ఞానఖనిలో అంత ఆసక్తినివ్వండి. జన్మ జన్మలకు మీతో సాంగత్యానివ్వండి చాలు! మాకది చాలు! శరణు!శరణు!శరణు!

**ఎప్పుడైతే శరణాగతి భావనరాదో – బాబాకు, మనకూ ఉన్న ఋణానుబంధాన్ని మరిచిపోతాం. –శ్రీబాబూజీ**



సంపుటి : 18
మార్చి 28

సంచిక : 2
2015







## సాయివంటి దైవంబు లేడోయి... లేడోయి...

ప్రజలందరి నోట సాయినామం పలకాలి!
సర్వత్రా సాయిరూపం రంజిల్లాలి.
ముజ్జగాలు సాయి మహిమతో ముప్పిరిగొనాలి!
సాయిపద రవళులు మన హృదయ కుహరంలోని నిశ్శబ్ద నిశీథిలో
ప్రతిధ్వనించాలి. ప్రణవనాద వీచికల్లా సాయిజ్ఞాన సౌరభాలు
సర్వత్రా వ్యాపించాలి. ఆ సుజ్ఞాన సౌరభాల ఆస్వాదనలో
మన మనసులు మత్తెక్కాలి!
సాయి ప్రేమామృత ధారలు అంతటా నిరంతరం వర్షించాలి!
ఆ ప్రేమామృత ధారలలో తడుస్తూ, ఆ జ్ఞాన సౌరభాల మత్తులో
ఆనందంగా నర్తిస్తూ, 'సాయివంటి దైవంబు లేడోయి లేడోయి!'
అని అందరూ ఏక కంఠంతో గానం చేయాలి!
అదే నా ఆశ, ఆశయం, ఆకాంక్ష! అదొక మధుర స్వప్నం.
ఆ స్వప్న సాఫల్యం కోసం శ్రీసాయినాథుని అనన్య ప్రేమతో ఆర్ద్రతతో
ప్రార్థించడమే మనం చేయగలిగింది, చేయవలసింది.

– శ్రీబాబూజీ



లోపలి పేజీలలో

తల్లి, తండ్రి, గురువు 4
– గురుకృప

నిరంతర ప్రవాహం 8
– శరశ్చంద్రికలు

మనకేం కావాలి? 15
– శరశ్చంద్రికలు

ఆచారాలు - సాంప్రదాయాలు 21
– శరశ్చంద్రికలు

నిర్వహణ : గురూజీ ఆశీస్సులతో – గురుబంధువులు

GURUKRUPA
Printed at : Ramakrishna Printers, Visakhapatnam.




# తల్లి, తండ్రి, గురువు

జగత్తులోని ప్రతీ జీవికి జన్మనిచ్చేది తల్లి..తండ్రి.. జరామరణాల చక్రభ్రమణం నుంచి మనలను విడిపించి – కని‘పెంచేవారు’ గురువు. సఫలమవ్వనని తెలిసినా ‘గురువు’ను వర్ణించే ప్రయత్నం.....పంటపొలాల గట్లపై, త్రాచుల పుట్లపై, సారవంతమైన మట్టిపై మొలిచే లేత గడ్డిని మాత్రమే స్వీకరిస్తుంది గోవు. శీతోష్ణాలకు లొంగక, దూరాభారములకు క్రుంగక తన ఆహారాన్వేషణను సాగించి స్వీకరిస్తుంది. వడివడిగా పారే నదీమతల్లి చెంతన చేరి కాలు జారక, పట్టుగా, ప్రవహించే నీటినే స్వీకరిస్తుంది గోవు. ఇతర జంతుజాలముల రూపంలో, వ్యక్తుల రూపంలో ఎదురయ్యే ప్రతికూలతలను అధిగమించి, ఆహారాన్ని స్వీకరించి, సమయమెరిగి నెమరు వేస్తుంది గోవు. అంతులేని శ్రమకు ఫలితం ఒక్క శేరు పాలు. అందుకే అన్నారు గోవుపాలను అమృతమని. శ్రమించి ఇంటికి వచ్చిన గోమాత ఇంటికి చేరగానే అంబారావముల లేగదూడ తల్లిని చూచి ఒక్క ఉదుటున తల్లి పొదుగును తన తలతో తడుతుంది. బిడ్డ ఆకలి, దప్పులెరిగిన గోమాత తాను చేసిన శ్రమనంతా మరచి క్షీరామృతాన్ని సంతత ధారలుగా అందిస్తుంది. గురువు–గోవు ఒక్క తీరే! క్షీరామృతాన్ని అందించేది గోవు అయితే జ్ఞానామృతాన్ని అందించేది గురువు. ముళ్లబాటల వెంట నడిచేది గోవు. సత్యాన్వేషణలో అలుపెరుగని బహుదూరపు బాటసారి గురువు. అందుకే భరతజాతి గోవు కన్పిస్తే పసుపు, కుంకుమ పెట్టి పూజిస్తుంది. గురువు కనిపిస్తే సాష్టాంగ, దండ ప్రణామాలర్పిస్తుంది. గోవు–గురువు లేని భారతదేశాన్ని ఒక్కసారి ఊహించి భరించగలగండి చూద్దాం. గురువులేని జాతి..చేరక తప్పదు అధోగతి. ఒక ప్రవచనకారుడు అంటున్నారు ఇలా “గురువు అనుగ్రహం కలిగితే మన ఆచరణ మారుతుంది. గురువుయందు ‘గురి’ కుదిరితే మన స్వధర్మాచరణ సరిగా జరుగుతుంది. ‘అంధకార వినాశత్వా గురురిత్యభిధేయతే’ ఎవరు అంధకారాన్ని తీసేస్తారో వారు గురువై యుంటారు. గురువు అంటే సంస్కృతంలో ‘మహాన్’ అంటే బరువైన, గొప్పదైనవారు. వారు ‘బరువై’తే మనం ‘లఘువు’ (చిన్నవాళ్లం) అయ్యాము. అంతరాంతరాళములయందు ఈశ్వరుని (దైవాన్ని) నింపుకోవడం వలన, ఈశ్వరతత్వాన్ని తెలుసుకోవడం వలన బరువు! దైవాన్ని తెలుసుకొనే ప్రయత్నం లేదు కనుక మనమందరం ‘లఘువు’ (చిన్న) అయ్యాము. సాధన దశనుండి సత్యాన్ని, సాధించిన వరకు సాగించిన తపోనిష్ఠల ఫలితాలను సరళీకరించి జనబాహుళ్యానికి సులభ మార్గంలో అందించేందుకు వచ్చిన అవతార పురుషులే గురువులు, సద్గురువులు. కృతజ్ఞత ఆశించక కురిసి, వర్షించే అపార కరుణామేఘుడు సద్గురువు. అలా తమ జీవిత పర్యంతం సాయి ‘సాధనకు అంకితమిచ్చి మనకు (సులభ) ఆనంద జీవనానికి కావలసిన తరుణోపాయాలను ‘భక్తిసాధనా రహస్యాలు’గా అందించిన కామధేనువు శ్రీసాయినాధుని శరత్‌బాబూజీ. భగవంతుని చేరడానికి ఉన్న మార్గాలు భక్తి, జ్ఞానమైతే.....సాయి పట్ల






“ఇది గురువుగారు తింటే ఎంత బాగుంటుందో కదా” అనిపిస్తుంది. అంతేగానీ తినేసిన తర్వాత, “ఇది చాలా బావుంది, ఇప్పుడు మనం దీనిని గురువుగారికి సమర్పించవచ్చు” అని అనుకోరు. అది అలా ఉండదు (గురువుగారు నవ్వుతూ..) అయినా మీరు దాని గురించి ఆలోచించకపోయినా అందులో ఇబ్బందేమీ లేదు.

ఇది కూడా చాలా గొప్ప యోగసాధనలా కనిపించినప్పటికీ, మనస్సులో ప్రేమ ఉన్నవాళ్ళకి ఇది సహజంగా సిద్ధిస్తుంది. వాళ్ళు ఆ యోగం చేస్తున్నారు. మనలో ఒక్కసారి ప్రేమ పుట్టాక ఈ విషయం మనకు బుద్ధిపూర్వకంగా అర్థం కాకపోయినా ప్రతిదీ అర్ధవంతంగానే ఉంటుంది.

**గురువుగారు :** ఇంద్రియాలన్నింటిలో రసనేంద్రియాన్ని (రుచిని) జయించడం చాలా కష్టం. అందుకనే వేమనయోగి, “జిహ్వను జయిస్తే సమస్తాన్ని జయించినట్లే” అని అన్నారు.

**భక్తుడు :** భగవాన్ రమణమహర్షి వడ్డించిన పదార్థాలన్నింటినీ ఏ మాత్రం తారతమ్యం లేకుండా కలిపి భుజించేవారు.

**గురువుగారు :** బాబా కూడా అలానే చేసేవారు. భిక్షలో లభించిన వాటన్నింటినీ ఒక కుండలో వేసి కలిపి ఆ తరువాత తినేవారు.

**భక్తుడు :** రుచిని జయించడమంటే రుచిపట్ల ఎటువంటి కోరికా లేకపోవడమా?

**గురువుగారు** : అవును. రుచిపట్ల ఎటువంటి వ్యామోహం లేకపోవడం. ఇటాలియన్ పిజ్జా?? (అక్కడ ఉన్నవారిలోని స్పందనలు గమనిస్తూ...) చూడండి, ఎంత త్వరగా మీ మనస్సులు ఉత్తేజిత మయ్యాయో (గురువుగారు నవ్వుతూ..) నేను గోంగూర లేదా ఆవకాయ పచ్చడి అంటే ఆంధ్రా మనస్సులు ఆ రుచులను ఊహిస్తాయి. అందుకనే ఎవరైనా ఏదైనా ఆహారాన్ని గురించి ప్రస్తావిస్తే మీ నోటిలో నీరు ఊరుతుంది. ఎందుకంటే మానసికంగా మీరు ఆ పదార్థాన్ని రుచి చూస్తున్నారు. దానికి అనుగుణంగా మీ శరీరం ప్రతిస్పందిస్తుంది. ఆ సూక్ష్మమైన కోరికనే మనం జయించాలి. మీకు ఇష్టమైన పదార్థాల ఫోటోలు చూసినా మీ మనస్సు వాటి రుచిని ఊహించకూడదు. మీరు ఈ పుస్తకాన్నో లేదా గ్లాసునో చూసినట్లు చూడగలగాలి. అదీ నిజంగా జయించడమంటే! ప్రయత్నించండి, మనం ఎంత బలహీనులమో తెలుస్తుంది. మనం ఆయా పదార్థాలు తినకూడదని కాదు, కానీ మనం వాటిని ఎలా చూస్తున్నాం, మనపై అవి ఎలాంటి ప్రభావాన్ని చూపుతున్నాయి అనే విషయాల పట్ల ఎరుకతో ఉండాలి. మనం ఆ ప్రభావం నుండి బయటపడాలి.

భక్త రామదాసు తమ రమణీయమైన సంకీర్తనలో ఇలా అంటారు... “రామా, నీ నామం



మీరు చేసే ఫోన్ మరింత అర్థవంతంగా, ఉపయుక్తంగా ఉండేందుకు ఏదో ఒకటి సృష్టించుకోవాలి, లేకపోతే అది కొన్నాళ్ళకు ఒక తంతుగా మారుతుంది. మనుషులు దేనినైనా తంతుగా మార్చగల సమర్థులు.

**భక్తుడు:** "ఎవరైతే నాకర్పించకుండా ఏమీ తినరో, వారికి నేను బానిసను" అన్నారు బాబా. నాకు ఈ విషయం గుర్తుపెట్టుకోవడం సాధ్యం కావడం లేదు. ఇంకో ప్రక్క నేను చాలా ముఖ్యమైన విషయాన్ని మర్చిపోతున్నానేమోనని అనిపిస్తోంది. బాబాకు అర్పించడం నిజంగా అంత ప్రధానమా?

**గురువుగారు:** దాని గురించి పట్టించుకోవద్దు.

**భక్తుడు:** కానీ అలా పట్టించుకోకుండా ఉండలేకపోతున్నాను.

**గురువుగారు:** అలా అయితే అర్థం చేసుకోవడానికి ప్రయత్నించండి. మీరు దానిని నిజంగా అర్థం చేసుకోలేకపోతే అది మీకు చాలా క్రొత్తగా కనిపిస్తుంటే దాని గురించి పట్టించుకోవద్దు. మీరు దాని గురించి ఆందోళనపడవద్దు. కానీ మీరే బాబాను గుర్తుపెట్టుకోవాలని ఉంది అని చెప్తున్నారు. మీరు ఆకలితో ఉండి ఆహారం కోసం పరితపిస్తున్నప్పుడు, మీకు ఆహారం దొరికిందనుకోండి. తక్షణం మీరు అన్నీ మర్చిపోతారు. ఎందుకంటే మీరు కేవలం మీ వ్యక్తిగత అవసరం గురించి మాత్రమే ఆలోచిస్తున్నారు. కానీ మీకు ఆహారం దొరికిన ఆ క్షణంలో కూడా మీ సద్గురువును గుర్తుపెట్టుకుంటే మీరు ఆయనను ఎంతగా గుర్తుపెట్టుకుంటున్నారో తెలుస్తుంది. మీకు ఆహారం దొరకకపోతే మీరు బాబాను గుర్తుపెట్టుకోవచ్చు కానీ, ఆహారం దొరికిన మరుక్షణం ఆయనను మర్చిపోవచ్చు. ఆ క్షణంలో కూడా నన్ను మర్చిపోవద్దు అంటున్నారు బాబా.

**భక్తుడు:** గురువుగారూ! బాబాను గుర్తుపెట్టుకోవడం ఎలా?

**గురువుగారు:** మీరు నిజంగా బాబాను ప్రేమిస్తే, మీరు బాబాను గుర్తుపెట్టుకుంటారు. ఉదాహరణకు, మీరు ఒక మంచి కేకును చూస్తారు. మీకు బాగా ఇష్టమైన వ్యక్తి ఆ కేకు తింటే బాగుండుననిపిస్తుంది. అది మీకు సహజంగా రానట్లయితే దానిని ఒక అభ్యాసంలాగా చేసినా ఫర్వాలేదు. చివరికి మీరు ఎటువంటి రుచికరమైన ఆహారాన్ని చూసినా ఒక రాయిని చూసినట్లు చూస్తారు. మీ మనస్సులో ఎటువంటి ప్రతిస్పందనా ఉండదు.

ఇటువంటి స్థితిని సాధించడానికి మనలో అటువంటి ప్రేమను పెంచుకోవడమే ఉత్తమమైన మార్గం. ప్రేమ పెరిగినపుడు మీ ఎరుకలో లేకుండానే దానికదే సహజంగా జరుగుతుంది. అది అలా జరిగిపోతుందంతే. మీరు ఎంతటి రుచికరమైన ఆహారపదార్థాలు చూసినా ముందు మీకు,





తమ అనురక్తితో భక్తిమార్గాన్ని ....విజ్ఞాన సారస్వతమై జ్ఞానమార్గాన్ని అందించిన ఆచార్యవర్యులు శ్రీబాబూజీ! సాయిపట్ల భక్తికి-సదా సాయిలో వశించేందుకు కావలసిన జ్ఞానాన్ని అందించ ప్రభవించిన అవతార వరిష్ఠులు శ్రీబాబూజీ.

**దర్శనాల స్ఫురణతో ఆదర్శాలవైపు :**

"సహనశీలి దృష్టి ఎప్పుడూ గంభీరంగా ఉంటుంది. మానవులను నిమిత్త మాత్రంగా చేసుకొని సకాలంలో తన కార్యాలను చక్కదిద్దుతూ ఉంటాడు భగవంతుడు. ప్రజలలోని నైతికపతనం, కోట్లాది జనుల ఆర్తనాదం అన్నీ కలిసి, ఒక మహాత్ముని రాకకు కారణమవుతుంది. ఆ మహాత్ముని చూపు పతితులను పావనం చేస్తుంది. కఠిన శిలలను కరిగించి మనుషులుగా మారుస్తుంది. ఆ మహాత్ముని మాట వేదమవుతుంది. అతని చేతలు (ఆచరణలు) జాతి గమనాన్ని నిర్దేశిస్తాయి. అతని ప్రతీ అడుగు ఒక పుణ్యతీర్థమవుతుంది. అతని తలపు కల్మష చిత్తాలను మంచిని పంచే అపురూప చిత్రాలుగా మలుస్తుంది. అతని నుండి వెలువడే వెలుగు ఆర్తుల అజ్ఞానాంధకారాలను పటాపంచలు చేసి మనుష్యత్వం నుంచి ముముక్షత్వం వైపుగా ఎలా పయనించాలో దారి చూపిస్తుంది.

సద్గురు దర్శనాల స్ఫురణలో ఆయా సన్నివేశాలలో ఆయన వర్తించిన తీరు, జాతి, ప్రాంత, భాషా, మతరహితంగా వారు ప్రతీ జీవిని ఆదరించిన వైనం, సాయిమతమంటే జనహితమేనన్న ఆయన ఆశయాలు, తన చెంతకు చేరే ప్రతీజీవి సాయితో రుణానుబంధం కలిగే తన వద్దకు వచ్చారన్న సాయి సత్స్వరూప సందర్శనం. సహస్రశీర్ష....సహస్రాక్ష....సహస్రపాత్ అంటూ దర్శించే (కన్పించే) ప్రతీజీవి శ్రీసాయిలో అంతర్భాగమేనన్న విశ్వరూప దర్శనం మనకు గుర్తుకొస్తే మన మార్గం తప్పక సాయిపథమవుతుంది. ఆ దర్శన ఫలం మనకందాలంటే వారు ప్రసాదించిన ఉపకరణాలైన సత్సంగం, పారాయణ, నామస్మరణ, సద్గ్రంథ పఠనం అన్నిటినీ వారు చెప్పిన రీతిన ఉపయోగించుకున్నపుడు మనకు తెలియకుండానే మనలో పరిణితి కలుగుతుంది. అపరిమితమైన ఆనందం సొంతమవుతుంది. అనంతమైన గురుకృప అర్థమవుతుంది. గురుచరణ ముద్రలను మది ధరించి వర్తమాన ప్రవర్తనలో వర్ధమాన పరివర్తన కలిగి అనుదిన ప్రవర్ధమానమై మనసును ఆహ్లాదపరుస్తుంది. సాటివారినిఆనందపరుస్తుంది. మన జీవితంలో ఎదురైన ప్రతీ సంఘటనలోనూ సద్గురు అనుగ్రహ ముద్రలను దర్శించుకుంటూ పోతే ఆయన మన చేయి పట్టి నడిపిస్తున్న తీరు గుహ్యంగా గోచరమవుతుంది. అలా దర్శించగలగడమే నిజమైన సాక్షాత్కారం. ఏది నిజమైన దర్శనం? ఏది ఆదర్శం? నీ చెంతకు చేరిన ప్రతీ జీవిలో నీ గురువు నీకు కన్పించారా...అది దర్శనం. నీ చెంతకు చేరిన ప్రతీ జీవికి నీ గురువు వారికి దర్శనమిచ్చాడా అది ఆదర్శం. మనల్ని చూస్తే మన గురువు వారికి గుర్తుకు రావాలి. గురువు నీకు 'గురి' అయ్యాడా! నువ్వు 'హరి'వి అయినట్లే.



**సమాశ్రయం నుంచి....సదాశయం వైపు :**

ఎందుకీ జీవితంలోకి వచ్చింది? పిడకలేరుకోవడానికా? గురువును తెలుసుకో! గురువుకు పగ్గాలప్పగించు. గురువే సర్వమును చేయువాడును, కర్తయని పూర్తిగా విశ్వసించు అన్నారు శ్రీసాయి. "నా భక్తులు అడిగినవన్నీ ఇస్తూనే ఉంటాను! నేను ఇవ్వదలచింది వారు అడిగేంత వరకు!" అడిగినవే కాదు, అడగనివి కూడా ఇచ్చే ఆదరించే అభయప్రదాయి సాయి. 'మన కోర్కెలను తీర్చిదిద్దే' క్రమంలోనే శ్రీబాబూజీ వంటి సమర్థ సద్గురు సమాశ్రయాన్ని ప్రసాదించి మనలను సాయి 'పథ'గాములను చేసారు. గురువుని ఆశ్రయించుకోవడం నుంచి గురువు ఆశయమేమిటో ఎరగాలి మనం. సద్గురుతత్వాన్ని తెలుసుకోవడం ఆయన గుణ (దైవీ) సంపత్తిని తెలుసుకొని ఆ గుణ సంపదను సొంతం చేసుకునేందుకు మన ప్రవర్తనను మార్చుకుంటూ జీవించాలి. అప్పుడే సాయిపథం మన జీవితాలలో 'ప్రగతి' పథంగా దర్శనమివ్వగలదు. మన ప్రవర్తనను అలా మార్చుకున్ననాడు మన జీవితాలలో యాంత్రికత తొలగిపోయి, సమాజంలో సద్గురు సుమసౌరభాలు వెల్లివిరుస్తాయి.

కొందరంటారు మా గురువు మాకు చాలా సన్నిహితులండీ అని! సద్గురు సంప్రదాయంలోని ఉపకరణాల వెలుగుదివ్వెలలో(తో) మనోమాలిన్యపు చీకట్లు తొలగి, జీవించే కళనెరిగి తన చుట్టూ ఆనందపు ప్రభ వెలిగి, సాయిజ్ఞాన సౌరభాల మత్తులో తాను, తన తోడిదే ఉన్న సాటి జనులందరూ ఏకకంఠంతో సాయి, సాయి...అంటూ ఆనందనర్తనం చేసిననాడు మనం సద్గురువుకు సన్నిహితులమయ్యామని అర్థం. జగద్రక్షకుడై వచ్చాయి సాయి-చేయి పట్టి నడిపించాడు సద్గురుమాయి. సద్గురు సమాశ్రయంతో అన్నీ పొంది అంతటితో ఆగిపోదామా? లేక నిరంతరం వర్షించే సాయి ప్రేమామృత ధారలలో మనము-మన సహచరులు తడిసి ఆనందంగా నర్తిస్తూ ఏకకంఠంతో "సాయి వంటి దైవంబు లేడోయి" అంటూ శ్రీబాబూజీ ఆశయానికి, ఆకాంక్షకు అనుగుణంగా మన ప్రవర్తనను మార్చుకుందామా? మనదే మొదటి అడుగు.....

**కు'రాగాల' రోగాల నుంచి....త్యాగాల వైపు:**

శ్రీసాయి అన్నారు....."పని చెయ్యి, సద్గ్రంధాలు చదువు, దేవుని నామం ఉచ్ఛరించు అని. మూర్తీభవించిన జ్ఞాన, వైరాగ్య, దైవీ స్వరూపులైన చంద్రశేఖరభారతీస్వామి ఇలా చెప్పేవారు..."దేవుడ్ని స్మరిస్తూ ఉండు, నీ నిత్య విధులను ఏమారకు, ఐశ్వర్య లంపటం తగ్గించుకో, ధనాశ వదులు, ఉన్నదానితో తృప్తిపడు, వైరాగ్యంగా ఉండు, నిర్లిప్తత అలవరచుకో" అని. శ్రీబాబూజీ అంటారు "కాస్త సమయంలో ఎన్నో సమస్యలు సృష్టించుకుంటాం. సంబంధబాంధవ్యాలలో సమస్యలు, ఒకరితో ఒకరు పోట్లాడుకోవడాలు, ఇలాంటివెన్నో.





అని అడుగుతుంది. అప్పుడు ఎవరో ఆమెకు ఈ పని క్రొత్త కాబట్టి ముందుగా ఎవరైనా అనుభవం ఉన్నవారి వద్ద సహాయకురాలిగా చేరితే మంచిది అని చెబుతారు (నవ్వులు...) కాబట్టి ఆమెకు అది సాధనవుతుంది. ఆ తరువాత నెమ్మదిగా కొంతమంది వేరే ప్రాంతానికి వెళ్ళి అక్కడ ఒక ఆశ్రమాన్ని ప్రారంభించి, "గురువుగారు ఇల్లు చిమ్మడం, పాత్రలు శుభ్రపరచడం గురించి చెప్పారు. ఇదే జ్ఞానానికి మార్గం" అంటారు. ఆ తరువాత వారు ధ్యానం కోసం ఒక హాలును నిర్మించి అందులో పాత్రలు, చీపురులు ఉంచుతారు (గురువుగారు నవ్వుతూ..) అక్కడకు అందరూ వచ్చి చీపురులు తీసుకుని గంటా రెండుగంటలు చిమ్ముతుంటారు – అది ఓ సాధన! అప్పుడు చీపురు సాధనలు, పద్ధతులు ప్రపంచమంతా వ్యాప్తిస్తాయి (నవ్వులు...) "ఓం, గురువుగారు ఆత్మసాక్షాత్కారానికి క్రొత్త మార్గాన్ని కనిపెట్టారు" అంటారు. అదలా కొనసాగి చీపురు మనకు చిహ్నంగా, మన గుర్తుగా మారుతుంది. అందరూ చీపురు బ్యాడ్జిని పెట్టుకుంటారు. (పెద్దగా నవ్వులు..)

ఇలాంటివి నిజంగానే జరిగాయి. ఇవి ప్రతి మతంలోనూ జరిగాయి. నేను ఊరికే సరదాకి చెప్పడం లేదు. మీరు ఇప్పుడు చూస్తున్న చాలా మతాలలోని సాధనలు ఇలాగే మొదలయ్యాయి. గతంలో ఎప్పుడో జ్ఞానులైన మహాత్ములు ఎవరో తమ శిష్యుడ్ని అతడు తన ప్రేమను వ్యక్తం చేయడానికి, అనుసంధానం చేసుకోవడానికి ఫలానా విధంగా చెయ్యమని సూచించి ఉంటారు. ఆ తరువాత కాలంలో దానినే అందరూ చెయ్యడం మొదలుపెడతారు. ఆ తరువాత కొన్ని సంవత్సరాలకు అవే సాధనలుగా మారుతాయి.

**భక్తుడు :** గురువుగారూ! నిన్న మీరన్న మాటలు నేను సరిగా అర్థం చేసుకున్నానో లేదో నాకు తెలియడం లేదు. మీరు సద్గురువుతో మా అనుబంధం గురించి చెబుతున్నప్పుడు, ఇలాంటి అనుబంధాన్ని కోరుకోవడమే సద్గురువుతో సన్నిహితంగా ఉన్నామనడానికి నిదర్శనం అని మీరన్నారా?

**గురువుగారు :** అటువంటి కోరిక ఉండటమే సాన్నిహిత్యం, మీ కోరిక స్తబ్దంగా ఉండదు, అది చాలా క్రియాశీలంగా ఉంటుంది. ఆ కోరిక ఏదో ఒక క్రియారూపంలో వ్యక్తం కావడానికి నిరంతరం ప్రయత్నిస్తూ ఉంటుంది. కాబట్టి రకరకాల మార్గాలలో సద్గురు సాన్నిహిత్యం కోసం ప్రయత్నం కొనసాగుతూ ఉంటుంది. మీరు ఇలాంటి సాన్నిహిత్యం కోసం తిరిగి తిరిగి ప్రయత్నిస్తూ ఉంటే అది కొంతకాలానికి ఒక పూజావిధిగా మారుతుంది. ఈ పూజావిధులనే సద్గురువుతో ఉండే సాన్నిహిత్యంగా భ్రమించడం జరుగుతుంది. ఉదాహరణకు, మీరు ప్రతిరోజూ శిరిడీకి ఫోన్ చేసి గురువుగారికి నమస్కారాలు తెలియచేయమని చెప్తారు. మీ పూజావిధి పూర్తయింది (గురువుగారు నవ్వుతూ..)




వాటి ద్వారా వ్యక్తం చెయ్యవచ్చు.

**భక్తుడు :** గురువుగారూ! ఒకసారి మీరు "బాబాను గుర్తుపెట్టుకుంటే చాలు" అని చెప్పడం నేను విన్నాను. నిజంగా బాబాను గుర్తుపెట్టుకుంటే సరిపోతుందా?

**గురువుగారు :** బాబాను గుర్తుపెట్టుకుంటే సరిపోతుందా అని మీరు అడిగిన ప్రశ్నే మీ అవగాహనను తెలియచేస్తుంది. కేవలం అది సరిపోతుందా? అని అడుగుతున్నారు. ముందు మీరు చేసి తరువాత నాకు చెప్పండి. ముందు సరిపోయినంత చెయ్యండి. (గురువుగారు నవ్వుతూ...) బాబాను గుర్తుపెట్టుకోవడం అదేదో అంత సులభమైనట్లు! ఆ ఒక్క సాధన సరిపోతుందా? అంటారు. ముందు చేసి చూడండి! ఒకవేళ అది సరిపోకపోతే నేను చెప్తాను. నా దృష్టిలో బాబాను గుర్తుపెట్టుకుంటే చాలు!

**భక్తుడు :** అలా అయితే భక్తులకు ఇన్ని రకాల సాధనలు ఎందుకివ్వబడ్డాయి?

**గురువుగారు:** నేను, "బాబాను గుర్తుపెట్టుకోండి" అని చెప్తే, అందరూ దానిని రకరకాలుగా చేస్తారు. తత్ఫలితంగా బాబాను గుర్తుపెట్టుకోవడానికి కొన్ని పద్ధతులు, పూజా విధానాలు లేక అభ్యాసాలు తయారవుతాయి. ఒకరకంగా అవన్నీ సాధనలు. కానీ ఒక్కసారి ఆ ప్రేమ, జిజ్ఞాస, అవసరమూ లేకపోతే – మనం చేసే సాధనలు మన భావోద్వేగాలను స్పృశించలేకపోతే – ఆ సాధన జవసత్వాలు కోల్పోతుంది.

**భక్తుడు :** అంటే అన్ని సాధనలూ బాబాను గుర్తుపెట్టుకోవడానికేనన్నమాట?

**గురువుగారు :** నిజానికి అవన్నీ ఉండేది అందుకే. రెండు రకాల సాధనలు ఉంటాయి. ఒక రకమైన సాధన అస్సలు సాధనలాగా కనిపించదు. ఉదాహరణకు, ఇక్కడ మీరు ఎలా ఉంటున్నారో చూడటానికి మీ దేశం నుండి మీ కుటుంబం ఇక్కడకు వచ్చిందనుకోండి. వాళ్ళు మీరు ప్రతిరోజూ ఉదయం ఇక్కడకు వచ్చి పాత్రలు శుభ్రం చేయడం, ఇల్లు చిమ్మడాన్ని చూస్తారు. వాళ్ళు మిమ్మల్ని, "ఇదేనా నువ్వు చేసే సాధన?" అని అడుగుతారు. మీరు దానికి ఏం సమాధానం చెబుతారు? అది సాధనా? కాదు. మరి కానప్పుడు ఇదేమిటి? మీరు ఇంట్లో చిమ్ముకోవడానికి, ఇక్కడ చిమ్మడానికి తేడా ఏమిటి? ఒక్కొక్కరూ ఒక్కోరకంగా దగ్గర (అనుసంధానం, కనెక్ట్) అవుతారు. రకరకాల సాధనలు వాళ్ళు అలా కనెక్ట్ (దగ్గర, అనుసంధానం) కావడం కోసమే ఏర్పడ్డాయి. కానీ బాహ్యంగా కనిపించే ఇలాంటి స్థూలమైన చర్యలే ముఖ్యమనిపించినపుడు అందులోని స్ఫూర్తి పోతుంది.

ఎవరైనా ఒక క్రొత్త వ్యక్తి వస్తుంది, "ఓ, ఇక్కడ గురువుగారి దగ్గర పాత్రలు శుభ్రం చేయడం ప్రధానమైన సాధన" అనుకుంటుంది. తర్వాత ఆమె, "నేను కూడా వచ్చి పాత్రలు శుభ్రం చేయవచ్చా"






"భారీ ఎత్తున డబ్బులు సంపాదించడానికి, ఆస్తిపాస్తులు కూడబెట్టుకోవడానికి ప్రయత్నిస్తాం. స్థలాలు కొనడం, ఇళ్లు కట్టుకోవడం, వాటన్నింటినీ మీ సృష్టిలాగా చూడడం, వాటితో అనుబంధాన్ని పెంచుకోవడం ఇవన్నీ నిజంగా అవసరమా? నిజంగా అది తెలివైన పనేనా?" "మన జీవితం మొత్తం ఒక ప్రయాణమని, మనం ఎప్పుడు వెళ్లిపోవాలో నిర్ణయం అయిపోయిందన్న విషయాన్ని మీరు మర్చిపోతున్నారు. దాని సంగతేంటి?" మనల్ని ఉద్ధరించడానికి సద్గురుమూర్తులు ప్రయత్నం చేయని క్షణం లేదు. కళ్ల ముందు కాలం పరిగెడుతోంది. ఎన్నో జీవులు పుడుతున్నాయి. కాలగర్భంలో కలిసి'పోతు'న్నాయి. అయినా దేన్నీ వదలం. అన్నీ మనవైపోవాలి. కనీసం ప్రక్కవాడిని చిరునవ్వుతో పలకరించం. కానీ భగవంతుడి గూర్చి, సద్గురుతత్త్వం గూర్చి ఉపన్యాసాలు చేస్తాం. భగవంతుని అనుగ్రహాన్ని నీకు అనుకూలంగా మలచుకునేదే పూజ. గురుదేవులంటారు "బాబాకు ఇష్టమైన నైవేద్యం ఏమిటంటే మీరు రియల్ హ్యూమన్ బీయింగ్స్‌గా పరివర్తన చెందడం, మానవత్వంతో ఉండడం, అలాకాక ఓ పండు పెట్టేసి కళ్లు తుడవాలని ప్రయత్నించవద్దు" అని. ఓ రోజున ఒకామె కర్పూరం తెచ్చి, భగవాన్‌కు ఆరతి ఇస్తుంటే రమణులన్నారు "ఈశ్వరుడు నీ సంచిత కర్మలనే కర్పూరంతో ఆరతిని కోరుకుంటుంటే...నీవేమో కానీ కర్పూరంతో ఆరతి ఇస్తున్నావు. ఇది కంటితుడుపు వ్యవహారం, వ్యాపారం" అన్నారు. "త్యాగైనేక అమృతత్వ మానుషః" అంటుంది మన భారత ధర్మం. అమృతత్వం పొందిన సంతుల జీవితాలే మనకు ఆదర్శం. తమ తపోమయ జీవితాలు, వారి సాధనా ఫలాలు, మస్తిష్కానికి అందని వారి త్యాగాలు మనకు దిశానిర్దేశం చేస్తున్నాయి. నిరాడంబర జీవనం, సర్వజనాదరణం, సకలజీవుల శ్రేయస్సు వారికి పెట్టని ఆభరణాలు. వారి పదాల్లో (బోధ) శ్రద్ధ కలిగి 'మనుష్యుల'మయితే వారి పథంలో నడిస్తే ముముక్షులమవుతామనడంలో సందేహం లేదు. 'నన్ను ఆనందస్వరూపంగా ధ్యానించు' అన్నారు శ్రీసాయి. సాటి మనిషిలో ఆనందం నింపగలిగితే ఆ ఆనందస్వరూపుని రూపం అక్కడే సాక్షాత్కరించింది కదా!

**అసుర 'అమావాస్య' నుండి పరి'పూర్ణిమ'వైపు :**

విశ్వసింపదగిన వేషంబు మరిలేదు, కుడువ గూడులేదు కోకలేదు, విశ్వమయుడైన విభునేల తెలియరో, విశ్వదాభిరామ వినురవేమ! " ఓ వేమా! ఆర్భాటమైన వేషం లేదనీ, తినడానికి తిండి లేదనీ, కట్టుకోవడానికి బట్టలేదనీ లోకులు బాధపడుతూ ఉంటారు. కానీ సకలమూ ప్రసాదించే భగవంతుడ్ని మాత్రం ఆశ్రయించరు. లోకం తీరు ఎంత విచిత్రమో కదా! వేమన మాట మనం ఆలోచించాల్సిన బాట. మనకు మాత్రం సాయి అన్నీ అందించారు ఈ రోజు. అయినా ఇంకా ఏదో వెలితి, ఆరాటం. రాయల వారంతటివాడు ఏం కావాలిరా నీకంటే నావంటివాడు మీతోటలో వంకాయలు కావాలని కోరాడట.


ఎంతకాలం ఈ చీకటిలో మగ్గుతాం. మనలో సద్గురుచంద్రుడు వెలిగించిన ఆ జ్యోతిని దర్శిద్దాం. మనలోనే ఉన్న ఆ సద్గురుమూర్తికి సింహాసనం వేసి అర్ఘ్య,పాద్యాలను సమర్పించి 'వ్యాసపీఠం''పై ఆసీనులను చేద్దాం. ఆచరణాత్మకంగా ఆయన నిర్దేశించిన పథంలో పయనిస్తూ, మనల్ని మనం పరిశీలించుకుంటూ, సద్గురు పథానికి అడ్డొచ్చే అంశాలను పరిష్కరించుకుంటూ, సాటివారికి కష్టాన్ని కలిగించే పనులను పరిత్యజిస్తూ, సద్గురు'పథా'లే పర్యవేక్షణగా, సద్గురుపథమే పవిత్రమార్గంగా 'గురు'పూర్ణిమకు పరిపూర్ణులమయ్యేందుకు పయనం మొదలెడదాం. సూటిగా సాయిపథంలో సాగేందుకు అడ్డొచ్చే అంశాలే 'అసుర' భావాలు. ఆ 'అసుర' భావాల చీకట్లు తొలగి మనందరకు 'పూర్ణ'మైన సద్గురు అనుగ్రహం లభించాలంటే గురుచరణాలే శరణం. సద్గురు చరణం శరణం.

మలయమారుతమైన సద్గురు సన్నిధానప్రాప్తి, ఆద్యంతాలు లేని సద్గురు చరణాల పట్ల ఆసక్తి, అహం అవధులను దాటించే సద్గురు స్మరణానురక్తి సదా మనందరిలో ప్రభవించి మన్మథనామ వత్సరం గురునామ వత్సరమవ్వాలని ఆకాంక్షిస్తోంది గురుకృప.

## శరత్చంద్రికలు

### నిరంతర ప్రవాహం *జనవరి 2015*

ఈ క్రింది సంభాషణలు శ్రీబాబూజీ గంగానదీ తీరంలో ఉన్నప్పుడు 2006 మరియు 2007 సంవత్సరాలలో జరిగిన సత్సంగాలలో చోటు చేసుకుంటున్నాయి.



**భక్తుడు:** గురువుగారూ! విషయాలలోని సూక్ష్మతత్వాన్ని లోతుగా అర్థం చేసుకోవడానికి మేము సున్నితత్వాన్ని పెంపొందించుకోవడం ముఖ్యమనిపిస్తోంది. సున్నితత్వమనేది హృదయవికాసం చెందేటందుకు ముందుగా ఎంతో అవసరమని, అంతేకాకుండా ఆ వికాసం వలన సున్నితత్వం కలుగుతుందని అనిపిస్తోంది.

**గురువుగారు:** మనం మన అవసరాలపట్ల, మన స్వప్రయోజనాలపట్ల సున్నితంగానే ఉంటాం, కానీ ఇతరుల అవసరాల విషయానికి వచ్చేటప్పటికి అలా ఉండం. నలుగురితో



మీరు తల లేకపోతే బ్రతకలేరు (గురువుగారు నవ్వుతూ...) అది అన్నింటికన్నా ముఖ్యమైన భాగం. మీరు ఓ మహాత్ముని పట్ల గౌరవభావాన్ని తెలియచేయాలనుకున్నప్పుడు మీ శరీరంలోని అత్యంత ముఖ్యమైన భాగంతో ఆయన దేహం యొక్క అధోభాగాన్ని అంటే ఆయన పాదాలను స్పృశిస్తారు. "నేను మీ దేహం యొక్క అధోభాగంతో కూడా సమానం కాదు. నేను మీకు అర్పించగలిగిన ముఖ్యమైనది ఇదే" ఇలా చెయ్యడం గౌరవభావాన్ని, వినయాన్ని తెలియచేస్తుంది. దీనివల్ల ఆ మహాత్ముని గొప్పతనం మనకు అనుభవమవుతుంది. అందువల్లే సాష్టాంగప్రణామం చేసి నుదుటితో మహాత్ముల పాదాలను స్పృశించడమనే ఆచారం ఏర్పడింది.

ఆంగ్లంలో కూడా, మీరు "టు బి ఎట్ సమ్ వన్ ఫీట్" (అతని పాదాల దగ్గర ఉండటం) అని అంటూ ఉంటారు కదా? "నేను ఈ విషయాన్ని నా గురువు పాదాల వద్దే నేర్చుకున్నాను(I Learnt it at the feet of my mentor). లేదా నా సమస్తాన్ని ఆమె పాదాల వద్ద ఉంచాను" అంటారు. అంటే దానర్థం మీకున్న సమస్తాన్ని ఆమెకు సమర్పించారు అని, లేదా నువ్వు ఆమె ఆధీనంలో ఉన్నావు అని!

**గురువుగారు:** ఏ ఆచార వ్యవహారాన్నైనా, ఏ మతంలోనైనా అది సాంప్రదాయబద్ధంగా వస్తోంది కాబట్టి అనుసరించవద్దు. అది ఒకవేళ మీ ప్రేమను సరిగ్గా వ్యక్తం చేస్తూ ఉంటే దానిని ఉపయోగ పెట్టుకోండి. అప్పుడది అర్థవంతమైన ఆచారమవుతుంది. ప్రతి సమాజానికి దానికే ప్రత్యేకమైన కొన్ని వ్యక్తీకరణలు ఉంటాయి, ప్రజలు వాటి మధ్యనే పెరిగి పెద్దవాళ్లవుతారు. వాళ్ళలో ప్రేమోద్వేగాలు జాగృతమైనపుడు ఆ పూజావిధులు వారి ప్రేమను వ్యక్తం చేయడానికి సాధనాలుగా మారుతాయి. క్రొత్త పద్ధతులు చాలా సందర్భాలలో అంత త్వరగా దొరకవు. అందువలన వారు తమ చుట్టూ ఉన్న వాతావరణం నుండి తమకు ముందే తెలిసిన పద్ధతులను ఉపయోగపెట్టుకుంటారు. ఒక రకంగా చూస్తే అది మంచిదే, ఎందుకంటే మనస్సు రకరకాల నూతన వ్యక్తీకరణల కోసం వెతుక్కోనక్కరలేదు.

ఉదాహరణకు, నా దగ్గర కొంతమందికి ప్రేమ అనుభవమవుతుంది. వారు దానిని వ్యక్తం చేయాలనుకుంటారు. వాళ్ళు ఎలా వ్యక్తం చేస్తారు? భారతీయ సంస్కృతిలో నమస్కరించమని, పాదాలను స్పృశించమని చెప్తారు. అంతకుముందు వాళ్ళు దేవాలయంలో లేదా ఇంటి దగ్గరా అలా చేసి ఉండవచ్చు. కానీ ఇప్పుడు వారికి ఎటువంటి భావోద్వేగం లేదు. ఇప్పుడు ఇక్కడ ప్రేమతో చేస్తారు. వాళ్ళు వారికి తెలిసిన పాత పద్ధతులను ఉపయోగపెట్టుకుని వాళ్ళ ప్రేమను




ద్వారా ఫలానా అనుభవం వస్తుందనే సిద్ధాంతానికీ, భావనకూ తేడా ఉంటుంది. ఏదైనా మంత్రాన్ని మళ్ళీ మళ్ళీ అనడం మూలాన ఆ అనుభవం వస్తుందని అనుకోవడం అర్థరహితం. మీరు ఆ మంత్రంతో అర్థవంతమైన పద్ధతిలో అనుసంధానమైతే అప్పుడు దానికి అర్థం ఉంటుంది.

మనం ఆచారాలుగా భావించే కొన్నింటిని సామాజిక జీవనం మనకు అందిస్తుంది. ఉదాహరణకు, మనం ఒక ఆలయానికి వెళితే, అక్కడ దైవాన్ని పూజించడానికి కొన్ని పద్ధతులు ఉంటాయి. మనం వాటిని అనుసరిస్తాము. అటువంటి వాటిపట్ల నాకు ఎటువంటి అభ్యంతరం లేదు.

**భక్తుడు:** గురువుగారూ! మేము ఏదైనా ప్రత్యేకమైన ఆరాధనాపద్ధతిని అనుసరించాలా?

**గురువుగారు:** నాకు ఎటువంటి ఆరాధనాపద్ధతి లేదు. నా పద్ధతి ప్రేమను వ్యక్తం చేయడమే. నేను హిందూ ఆగమశాస్త్రాలు గురించి ప్రవచనాలివ్వాలనుకోవడం లేదు. అది నా పద్ధతి కాదు. శాస్త్రోక్తంగా జరిగే పూజలతో, ఆరాధనలతో నాకు ఎటువంటి ఇబ్బందీ లేదు. అలా చేయడం తప్పేమీ కాదు. కానీ అవి అంత అవసరం కాదు. పూజించడానికి చాలా రకాలైన మార్గాలున్నాయి. సహజంగా, స్వాభావికంగా మీ మనస్సుకు వచ్చిన వ్యక్తీకరణను మీరు ఉపయోగించుకోవచ్చు.

**భక్తుడు:** అవి సంస్కృతి, సాంప్రదాయాలకు అనుగుణంగా ఉండాలి కదా?

**గురువుగారు:** అది సంస్కృతికి సంబంధించిన ప్రశ్న కాదు. మనం ఎక్కడున్నామో ఆ సమాజపు పద్ధతులకు విరుద్ధంగా లేకుండా సామాజిక స్పృహతో ఉండటానికి సంబంధించిన విషయం. మీరు మీమీ దేశాలలో ఉన్నప్పటికీ మీరు ఒక పద్ధతికి కట్టుబడే నడుచుకోవాలి. అయినా మీరు ఇక్కడకు వచ్చింది ఆచారకాండను నేర్చుకోవడానికో, ప్రేమను వ్యక్తం చేసే పద్ధతుల గురించి తెలుసుకోవడానికో కాదు. మీరు ఇక్కడకు వచ్చింది ప్రేమను అనుభవంలోకి తెచ్చుకోవడానికి. ముందు ప్రేమను కలిగి ఉండండి. తరువాత దానిని ఎలా వ్యక్తం చేయాలో ఆలోచిద్దాం. (గురువుగారు నవ్వుతూ...)

**భక్తుడు:** గురువుగారూ! పాశ్చాత్యులమైన మేము చాలా తప్పులు చేస్తాము. దానివల్ల అప్పుడప్పుడు భారతీయుల మనోభావాలు దెబ్బతింటున్నాయి. ఉదాహరణకు, గురువు లేదా దేవతామూర్తివైపు పాదాలు పెట్టడం వంటి వాటిని ఇక్కడ ఎందుకు తప్పుగా భావిస్తారు?

**గురువుగారు:** ఒక్కసారి ఆలోచించండి. మన శరీరానికి పాదాలు అథోభాగంలో ఉంటాయి. ఎప్పుడూ మురికిని తాకుతూ ఉంటాయి. మన శరీరంలోని అథమమైన భాగాలను ఒక పూజనీయమైన వారివైపు ఉంచటం గౌరవప్రదం కాదు. మన శరీరంలో అన్నింటికన్నా ముఖ్యమైన భాగం ఏమిటి? మన తల! మీరు ఒక కాలు లేకపోయినా బ్రతకవచ్చు. ఒక చెయ్యి లేకపోయినా బ్రతకవచ్చు. కానీ






కలసి సమిష్టిగా చేసే పనులు – ఉదాహరణకు గ్రూప్ ప్రాజెక్ట్ లేదా సత్సంగం – మొదలైన వాటిలో పాలు పంచుకోవడం ద్వారా సున్నితత్వాన్ని అలవర్చుకోవచ్చు. సత్సంగంలో నేను మాట్లాడుతున్నప్పుడు మీరు శ్రద్ధగా వింటున్నారు, మీ ఇంద్రియాలు ఎంతో సునిశితంగా, సున్నితంగా పనిచేస్తున్నాయి. మీరు మీ ఇంద్రియాల సామర్థ్యాన్ని పెంచుతున్నారు. సమర్థవంతమైన సున్నితమైన ఇంద్రియాలు ఉండటమంటే మీరు సున్నితమైన మనుషులు అనే కదా అర్థం. అంతే కదా(నవ్వులు...) అప్పుడు బుద్ధుడి అష్టాంగమార్గంలోని అన్ని లక్షణాలు – సమ్యక్ దృష్టి, సమ్యక్ వాక్కు మొదలైనవన్నీ మనకు ప్రాప్తిస్తాయి. ఆ స్థితిలో మన ఇంద్రియాలు మనలో అంతర్గతంగా ఉన్నదానికి అడ్డురాకుండా పనిచేస్తాయి. అంతేకాకుండా అవి మనలోని చైతన్య ప్రవాహం పట్ల, ఆధ్యాత్మికమైన ఉనికిపట్ల సున్నితంగా మారుతాయి. మీరిప్పుడు మీ ఉనికిని గుర్తించలేకపోవచ్చు. కానీ మీరు జీవితంలోని మిగతా విషయాలలో సున్నితంగా ఉంటే, మీలో అంతర్గతంగా ఉండే ఆ (చైతన్య) ప్రవాహం పట్ల కూడా సున్నితంగా తయారవుతారు. అది మీ అనుభవంలోకి రావడం ప్రారంభమవుతుంది. మీరు సున్నితత్వాన్ని పెంపొందించుకుంటే మీరు ప్రతిచోటా ఈ ప్రవాహమనే సూత్రాన్ని చూడగలుగుతారు, అనుభవించగలుగుతారు. ఆ ప్రవాహం మీలో లేదా? మీలో రక్తం ప్రవహించడం లేదా? ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో గాలి ప్రవాహం లేదా? నా మాటలు ప్రవాహరూపాలే కదా! ప్రవాహం లేనిదెక్కడ? ప్రతి దగ్గరా ఓ ప్రవాహం – గతి, వేగం, నిరంతర మార్పు ఉంటుంది. మీరు సున్నితంగా మారే కొద్దీ ఈ ప్రవాహాలన్నింటికీ మూలమైన ఆ చైతన్య ప్రవాహాన్ని కూడా గుర్తించగలిగే సున్నితత్వాన్ని మీరు పొందగలరు.

**భక్తుడు:** గురువుగారూ! అటువంటి సున్నితత్వాన్ని పెంపొందించుకోవడం ఎలా?

**గురువుగారు:** ముందుగా మీరు విచక్షణారాహిత్యంగానూ, మొద్దుబారినట్లుగానూ లేకుండా ఉండటానికి ప్రయత్నించండి. మీ జీవితంలోని పరిస్థితులలో, మీ చుట్టూ ఉన్న వాతావరణంలో, ప్రవర్తనలో, ఇలా అన్ని విషయాలలో సున్నితంగా ఉండటానికి ప్రయత్నించండి. అప్పుడు సున్నితత్వం పెరుగుతుంది. ఆ సున్నితత్వం క్రమంగా పెరిగి మీరు అతి సున్నితంగా మారుతారు.

**భక్తుడు:** గురువుగారూ! నేను గంగా ప్రవాహాన్ని చూస్తూ గంటల తరబడి కూర్చోగలుగుతున్నాను. ఎంతకీ విసుగు పుట్టడం లేదు. ఆ ప్రవాహం ఎందుకని అంతగా ఆకట్టుకుంటుంది?

**గురువుగారు:** నదీ ప్రవాహమైనా, మరే ప్రవాహమైనా దానిని చూసి అందరూ అంతగా ముగ్ధులవ్వడానికి కారణం మనం దానిని చూసినపుడు ఆ ప్రవాహతత్త్వాన్ని (సూత్రాన్ని) అనుభూతి చెందడమే. మనం ప్రవహిస్తున్న నీటిని చూసినపుడు మనకు తెలియకుండానే మనం ఆ ప్రవాహంతో తాదాత్మ్యం




చెందుతాము. మనల్ని కట్టిపడేసేది ఆ ప్రవాహం కాదు. ప్రవహించేటటువంటి తత్త్వం. ఒక బ్రిడ్జి మీద నిలబడి క్రింద ప్రవహించే నదిని చూడండి. ఆ ప్రవాహ రూపంలో మార్పేమీ ఉండదు, కానీ ఎంతసేపు దానిని చూసినా మనకు బోరుకొట్టదు. అందులో విసుగు ఉండదు. ఎందుకని? మనం అలా చూడటం మొదలుపెట్టిన కాసేపటి తరువాత మన మనస్సు మనం నదిని చూస్తున్నామని, నీళ్ళు ప్రవహిస్తున్నాయని మర్చిపోతుంది – ఆ ప్రవాహాన్ని అనుభూతి చెందుతూ ఉంటుంది. ఆ ప్రవాహతత్వంతో మనస్సు కలసి దానితో తాదాత్మ్యాన్ని పొందుతుంది. దానిలో లీనమవుతుంది. ఆ స్థితిలో మీకు కలిగిన అనుభవాన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో ఆధ్యాత్మికానుభవం అంటారు.

దాని వెనుకగల సూత్రం – ప్రవాహతత్వం, ప్రవహించేతత్వం. ప్రతిదీ ఎంతో వేగంగా కదలిపోతూ ఉండటం వలన అది అంతా మనకు ఒక్కటిగా కనిపిస్తుంది. ఉదాహరణకు సినిమా ఫిల్మును తీసుకోండి. ప్రొజెక్టరు ముందు ప్రతి ఫ్రేము ఎంతో వేగంగా తిరుగుతూ ఉండటం వలన తెరమీద చూసినపుడు ఒక దృశ్యంలా కనిపిస్తుంది. ప్రతి ఫ్రేము వేగంగా మారిపోతూ ఉంటుంది, సెకనుకు 24 ఫ్రేములు అలా వెళ్లడం వలన మనకది కళ్ళముందు జరుగుతున్న దృశ్యంలా ఉంటుంది. అలా విడి విడి ఫ్రేములను ఒక దృశ్యంగా (సినిమాగా) చేసేది ఏమిటి? ఆ ఫ్రేములను కలిపేది ఏమిటి? ఆ లింకును, వాటిని అలా కలిపి ఒక దృశ్యంలా మార్చే దానిని విభిన్న ఆధ్యాత్మిక సాంప్రదాయాలలో వివిధ రకాల పేర్లు పెట్టి రకరకాలుగా వివరించి చెప్పారు. కొందరు దానిని ఆత్మ అన్నారు. అది జాగ్రత్, స్వప్న సుషుప్తి అవస్థలను నిరంతరం అనుసంధానించేదిగా ఉంటుంది. ఆ అనుభవానికి నాకు దగ్గరగా అనిపించే అనుభవం: ప్రవహించే నదిని చూస్తూ ఉండటం. అది మనకు గతి సూత్రాన్ని, ప్రవాహతత్వాన్ని తెలియచేస్తుంది.

**భక్తుడు :** గురువుగారూ!ఒక ఫ్రేమును, ఆ ఒక్క ఫ్రేమును అనుభవంలోకి తెచ్చుకోవడం సాధ్యమవుతుందా?

**గురువుగారు :** దానివల్ల ప్రయోజనం లేదు. ఇది మానసిక విశ్లేషణ కంటే భిన్నమైనది. మానసిక విశ్లేషకులు ఒక్కో ఫ్రేమును కత్తిరించి చూడాలనుకుంటారు. అలా కాకుండా ఆ ఇరవై నాలుగు ఫ్రేములను మీరు ఒక్కటిగా భ్రమపడినా తప్పే. అదీ వాస్తవం కాదు. ఆ ఫ్రేములను కలుపుతూ సినిమాను వాస్తవంగా మనకు అనుభవమయ్యేలా చేస్తున్న ఆ సూత్రాన్ని పట్టుకోగలగాలి. అన్ని ఆధ్యాత్మిక సాంప్రదాయాల గమ్యం అదే. మనం దానిని అప్పుడప్పుడూ అనుభూతి చెందుతూ ఉంటాం. ఉదాహరణకు, ఒక ప్రవాహాన్ని చూస్తేనో, విమానంలో ప్రయాణించినపుడో మనకు ఆ






**గురువుగారు :** ఇది అలాగే ఉంటుంది. ఇంతకు క్రితం నేను మాట్లాడింది దీని గురించే. ఆచారవిధుల వెనుక గల సూత్రాన్ని మీరు అర్థం చేసుకుంటే ఇక మీకు అటువంటి అపరాధభావం కలగదు.

మీలో ఒక భావోద్వేగాన్ని పెంపొందించుకోవాలనుకుంటే, మీరు దానిని వ్యక్తం చేయాలి. మీకు భక్తిపట్ల ఆసక్తి లేకపోతే, లేదా మీరు మీ ప్రేమను వ్యక్తం చేయాలనుకోకపోతే మీరు దాని గురించి బాధపడాల్సిన అవసరం లేదు. మీరు ఆరాధించే రూపం ముందు సాష్టాంగపడాల్సిన అవసరం లేదు. అలా కాకుండా మీరు ఆ రూపాన్ని ప్రేమించాలనుకుంటే మీ ప్రేమను పెంచుకోవాలనుకుంటే సాష్టాంగనమస్కారాలు మొదలైనవి మీకు ఆసరాగా మారుతాయి. అప్పుడు వాటికి కాస్తయినా అర్థముంటుంది. అలా కాకపోతే ఏ పూజైనా, ఏ ఆచారమైనా, అది ఎలాంటిదైనా కానివ్వండి, అది నిరర్థకం.

**భక్తుడు :** అంటే ఆచారం అనేది ఆ అనుభవం రావడానికి దోహదం చేస్తుందంటారా?

**గురువుగారు :** అవును, దోహదం చెయ్యవచ్చు. ఉదాహరణకు, మనకు ఒకరిపట్ల భక్తిపూర్వకమైన ప్రేమ అనుభవమయ్యి, మనం ఆ ప్రేమభావాన్ని కోల్పోయే స్థితికి చేరుకున్నామనుకున్నప్పుడు కొన్నిసార్లు ఒక పూజావిధి మనకు ఆ ప్రేమభావాన్ని నిలుపుకోవడానికి తోడ్పడవచ్చు. కానీ మనం కేవలం ఒక పూజావిధినే మళ్ళీ మళ్ళీ చేసుకుంటూపోతే అది తంతుగా మారుతుంది. అలా అయినపుడు మన అనుభవాన్ని నిలబెట్టుకోవడంకన్నా దానిని కోల్పోయే ప్రమాదమే ఎక్కువగా ఉంటుంది. అందుకనే నేను పూజావిధులను గురించి పెద్దగా పట్టించుకోను. కానీ వాటిని చెయ్యడానికి అభ్యంతరపెట్టను. వాటి స్థానం, పాత్ర, ప్రయోజనం వాటికున్నాయి. వాటిని మనం ఇలానే చూడాలి.

**గురువుగారు :** కొన్నిసార్లు మనం చేసే పనులు మన ఆనందాన్ని, ప్రేమను పెంపొందించేలా చేస్తాయి. తరువాత మనకెప్పుడైనా అటువంటి ప్రేమానుభూతి కలగనప్పుడు, అంతకుముందు చేసిన పనులు తిరిగి చేస్తే మనకు ఆ ఆనందం, ప్రేమ అనుభవమవుతాయేమో అని మనస్సుకు అనిపిస్తుంది. కొన్నిసార్లు అలా చేయడం ఉపకరిస్తుంది కూడా. అవి శాస్త్రీయ గ్రంథాలలో లేనటువంటి మన స్వంత పూజావిధులు. ప్రతి ఒక్కరికీ వాళ్ళ వాళ్ళ పద్ధతులు ఉంటాయి. నాకూ నా పద్ధతులు ఉన్నాయి.

**భక్తుడు :** అంటే, అలా అయితే మన సాధనకు కూడా స్థానం ఉంది కదా?

**గురువుగారు :** నేను దానిని సాధన అనను. మీరు దానిని సాధన అంటానంటే నాకేమీ అభ్యంతరం లేదు. నిజానికది మీ ప్రేమకు వ్యక్తీకరణ. మీకు ఆ అనుభవం మళ్ళీ కావాలంటే, అది పొందేందుకు తదనుగుణంగా ప్రయత్నిస్తారు. ఇలా చెయ్యడానికి, ఫలానా పద్ధతి మంచిదని దానిని చెయ్యడం




సాంప్రదాయాలను తిరిగి పునరుజ్జీవింపచేయడానికి మహాత్ములు ఉద్భవించారు. ఇది ఇలా కొనసాగుతూనే ఉంది. భారతదేశంలో కూడా ఇలానే జరిగింది. వేద సాంప్రదాయం పూర్తిగా కర్మకాండతో నిండిపోయినపుడు బుద్ధుడు, మహావీరుడు అవతరించారు. తరువాత శంకరులు, రామానుజులు రావడం జరిగింది. ఆ తరువాత సంస్కరించవలసిన అవసరం కలిగినపుడు గోరఖ్‌నాథ్ సాంప్రదాయానికి చెందిన మహాత్ముల ఆగమనం జరిగింది. ఇప్పుడు సాయిబాబా వచ్చారు. కొంత కాలానికి సాయిసాంప్రదాయం కూడా ఆచారకాండతో నిండిపోతుంది, దానిలో ఏం సందేహం లేదు. అప్పుడు మరో రూపం అవతరించి ఆ సాంప్రదాయాన్ని పునరుద్ధరిస్తుంది. ఇదే చారిత్రక గమనం.

**గురువుగారు:** పూజావిధులు అర్థరహితంగా కేవలం యాంత్రికంగా మారితే అప్పుడు మీరు వాటిని వదిలిపెట్టేయవచ్చు. అయినప్పటికీ కొన్నిసార్లు వాటిని తిరిగి తిరిగి చేస్తూ పోతే అవి మీలో ప్రేమను ప్రేరేపించవచ్చు. మీలో ఆ ప్రేరణను జాగృతం చేసుకునేటందుకు మీకిక వేరే మార్గమే లేకపోతే ఆ ప్రేమను పెంపొందించుకోవడానికి చివరిగా మీరు ఈ పూజావిధులను ఆశ్రయించవచ్చు.

**భక్తుడు:** ఈ పూజా కార్యక్రమాలు చేస్తున్నప్పుడు కలిగే భావోద్వేగం ప్రతిసారీ క్రొత్తగానే ఉంటుందా?

**గురువుగారు:** మీలో ఆ భావోద్వేగం కలిగినపుడు దానికి మీ ప్రతిస్పందన క్రొత్తగానే ఉంటుంది. ఆ పూజావిధి మొట్టమొదట ఏ భావోద్వేగాన్ని వ్యక్తీకరించడానికి ఉపయోగపడిందో సరిగ్గా అటువంటి ప్రతిస్పందన మీలో కలగాల్సిన అవసరం లేదు. ఒక సంగీతకారుడు ప్రేమలో వైఫల్యం చెంది ఒక రాగాన్ని స్వరపరిచాడనుకుందాం. అది విషాదభరితంగా ఉంటుంది. కానీ మీరు ఆ రాగాన్ని వింటున్నప్పుడు మీకూ విషాదకరమైన భావనలు కలుగవచ్చు కానీ అది ప్రేమ వైఫల్యం వలన కలిగే విషాదానుభూతే కాకపోవచ్చు. గతంలో మీకు కలిగిన బాధాకరమైన అనుభవాలు, ఉదాహరణకు మీరు కోల్పోయిన స్నేహితులు లేక బంధువులకు సంబంధించిన విషయాలు మీ మనస్సుకు వస్తాయి. ఇది మీరు సరిగ్గా అర్థం చేసుకుంటే, నిజమైన పూజకు గల అర్థాన్ని మీరు అవగతం చేసుకోగలరు. అప్పుడు మీరు ఈ పూజా కార్యక్రమాలను కేవలం సాంప్రదాయపు వింతపోకడలుగా చూడటం మానుకుంటారు.

**భక్తుడు:** కొన్నిసార్లు నాకు సాష్టాంగనమస్కారం చేయడానికి మనస్కరించదు. కానీ బలవంతంగా చేస్తాను. అలా సాష్టాంగనమస్కారం చేయడం ద్వారా నాకు అంతకుముందు నా అనుభవంలో లేని ఒక విషయాన్ని అనుభవంలోకి తెచ్చుకోవాలి అనుకుంటాను. సాష్టాంగనమస్కారం చేసిన తరువాత నేను దానిని సరైన భావంతో చెయ్యడం లేదనిపించి నేను తప్పు చేశానన్న భావన కలుగుతోంది.






అనుభవం కలుగుతుంది. మనం అత్యధిక వేగంతో ప్రయాణించినపుడు ఆ ప్రయాణం మనకు అటువంటి అనుభవాన్ని ఇస్తుంది. దానికి కారణమేమిటంటే మనస్సు ఆ ప్రవాహతత్వంతో, వేగంతో ఒక్కటవుతుంది. మనస్సు శూన్యమవుతుంది. వ్యోమగాముల అనుభవాలు చదవండి. గురుత్వాకర్షణ శక్తి లేకపోవడం వలన శరీరం భారరహితంగా తయారవుతుంది. తమ ఆలోచనలు కూడా ఆ స్థిరత్వాన్ని (గురుత్వాకర్షణను) కోల్పోయాయని వారు చెప్పారు.

**భక్తుడు:** మహాత్ములకు ఒక్కో ఫ్రేము మరియు ఇలాంటి ఫ్రేములు వేగంగా కదలడం వల్ల రూపుదిద్దుకునే దృశ్యం – ఈ రెండూ ఒకేసారి అనుభవమవుతాయా?

**గురువుగారు:** వాళ్ళు ఆ ప్రవాహం వెనుకగల సూత్రాన్ని అనుభవిస్తూ ఉంటారు.

**భక్తుడు:** ఆ ప్రవాహమే ఆ ఫ్రేములను కలుపుతుందా?

**గురువుగారు:** ఒక విధంగా చెప్పాలంటే నిజమే. అది కేవలం ఫ్రేములను మాత్రమే కలపదు, అది వాటిని కదిలేలా చేసి వాటిని ఒకే దృశ్యంగా మనకు అనుభవమయ్యేలా చేస్తుంది. అది వాటిని కేవలం కలిపి వాటిని కదలకుండా చేస్తే, మీకు కేవలం ఒక్కఫ్రేము మాత్రమే కనిపిస్తుంది! అది కేవలం దానిని కలిపే శక్తి మాత్రమే కాదు, అది వాటిని కదిలిస్తుంది. కానీ అది మాత్రం స్థిరంగా ఉంటుంది. అది 'చలం' మరియు 'అ-చలం', 'అరుణాచలం' పేరు వెనుక గల సూత్రం ఇదేనని మీకు ఇంతకుముందు చెప్పినట్లున్నాను. 'అరుణ' అంటే సంస్కృతంలో ఎరుపు అని అర్థం. అది వేడికి చిహ్నం. మీలో ఉద్రేకం, కోపం వచ్చినపుడు ముఖం ఎర్రబడటంలాగా లోపల ఏదో చర్య జరుగుతూ ఉంటుంది. అందుకే హిందూమతంలో ఎరుపును కార్యసాధనకు చిహ్నంగా చెప్తుంటారు, అది గతిశీలమైనది. 'అచల' అంటే నిశ్చలం, 'అ–చల', అది పూర్తిగా అచలమూ కాదు, అలా అని పూర్తిగా చలిస్తూ ఉండదు, వీటికి అతీతంగా ఉంటుంది.

**భక్తుడు:** గురువుగారూ! మన చైతన్యం యొక్క స్వభావం క్రియాశీలంగా ఉండటమని చెప్పారు. అంటే దానర్థం అది నిరంతరం మారుతూ ఉంటుందా?

**గురువుగారు:** అది మారదు. క్రియాశీలంగా ఉండటమంటే మారుతూ ఉండటమని కాదు. అక్కడ ఉత్తేజకరమైన ఆనందానుభూతి ఉంటుంది. అది క్రియాశీలంగా ఉండటమంటే.

**భక్తుడు:** అంటే అక్కడ ఒకరకమైన కదలిక ఉంటుంది, నది ప్రవహిస్తున్నట్లుగా?

**గురువుగారు:** నిజమే. అది ఒకరకమైన కదలికలాగా కూడా మనకు అనుభవమవుతుంది. నదిలాగే మన చైతన్యం నిరంతరం చలిస్తూనే ఉంటుంది. అది మనకు నిరంతరాయమైన ఒకే అనుభవంగా

అనుభవమవుతుంది. నది మన చైతన్యాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రవహించే నదిని చూసినపుడు అది ఒకే విధంగానే ఉన్నట్లుగా మనకు అనుభవమైనప్పటికీ మన చైతన్యం ఆ కదలికతో (ప్రవాహంతో) మనకు తెలియకుండానే మమేకమవుతుంది. మన చైతన్యం దానితో ఒక్కటవుతుంది. అక్కడ క్రియాశీలత ఉంటుంది.

మన చైతన్యం పరవళ్ళు త్రొక్కుతూ ప్రవహిస్తున్న నదిలాంటిది. అది ఎక్కడ నుండి వచ్చిందో, ఎక్కడకు వెళుతుందో మనకు తెలియదు. మన జీవితంలో మనకు ఎదురయ్యే వివిధ అనుభవాలు ఇటువంటి వస్తువుల వంటివి. మనం వాటితో తాదాత్మ్యం చెంది వాటితోపాటు కదులుతూ మనం కదులుతున్నామని అనుకుంటూ ఉంటాం. కదిలే వస్తువును కాకుండా మనం ఆ కదలికను పట్టుకోవాలి. ఆ కదలిక పట్ల ఎరుకతో ఉండి దానిని అర్థం చేసుకోండి. దానితో మమేకమవ్వండి. అది మనకు సాధారణంగా అనుభవమయ్యే సాపేక్షమైన చలనంకాదు, అది మరోరకమైనది. దానికి దగ్గరగా నేను చెప్పగలిగిన పోలిక నదీ ప్రవాహం. నదీ ప్రవాహాన్ని చూసేటప్పుడు మన సాపేక్షికమైన అనుభవస్థాయిని దాటిపోయి మనల్ని మనం మర్చిపోతాం. అటువంటి కదలికపట్ల ఎరుకతో ఉండటం చాలా అరుదుగా జరుగుతుంది. మహాత్ములు ఆ కదలికతో ఎప్పుడూ తాదాత్మ్యం చెంది ఉంటారు. ఈ ప్రపంచాన్నంతా ఇలాంటి నదీప్రవాహంగా చూస్తారు.

**భక్తుడు:** ఎటువంటి భావోద్వేగం (ఎమోషన్) లేకుండా?

**గురువుగారు:** అవును. ఎటువంటి భావోద్వేగం లేకుండా.

**భక్తుడు:** కాబట్టి భావోద్వేగం మనల్ని బయటకు తీసుకువచ్చి మన తాదాత్మ్యాన్ని చెదరగొడుతుందా?

**గురువుగారు:** అవును. మనం కేవలం ఒక కదలాడే వస్తువుతో ఒక్కటవుతాం. కానీ ఆ కదిలించే తత్వంతో కాదు.

**భక్తుడు:** మేము వస్తువిషయాల కదలికకు కారణమైన దానితో తాదాత్మ్యం చెందడానికి బదులుగా ఆ విషయాలతో తాదాత్మ్యం చెందడం వలన మా ప్రతి అనుభవం చివరకు అసంతృప్తిని మిగిలిస్తోందా? మహాత్ములు విషయాలకు బదులుగా వాటిని కదిలించే దానితో తాదాత్మ్యం చెందుతారా?

**గురువుగారు:** అవును. మహాత్ములు ఆ కదిలించే తత్వంతో తాదాత్మ్యం చెందుతారు. అది చైతన్యానికి సహజమైన లక్షణం. నిజానికి చెప్పాలంటే కేవలం నదులు మాత్రమే కాదు. ప్రతిదీ, సమస్త విశ్వం చలిస్తోంది. ప్రతి ఒక్కటీ చలనంలోనే ఉంది. మహాత్ములు వారెక్కడున్నప్పటికీ దీనిని అనుభవిస్తూ ఉంటారు. **ఆయన మొత్తం ప్రపంచాన్ని గంగా ప్రవాహాన్ని చూస్తున్నట్లే చూస్తూ ఉంటారు.** అందుకనే ఎక్కడైతే మహాత్ములు ఉంటారో అక్కడ తీర్థం ఉంటుందని శాస్త్రాలు చెబుతాయి. **ఆయన ఈ గంగా**




ఉన్నతమైన మార్గం నుండి ప్రక్కకు పోతే అదే బాటలో ఇతర విషయాలలోనూ రాజీపడటం మొదలుపెడతారు. ప్రారంభంలో అది చిన్నదిగానే ఉంటుంది, కానీ క్రమంగా అందరూ అదే దారిలోకి వెళ్ళిపోతారు.

ఆ తరువాత క్విట్ ఇండియా ఉద్యమం రావడానికి దాదాపు 25 సంవత్సరాల సమయం పట్టింది. కేవలం ఒకే ఒక్క సంఘటన మూలంగా స్వాతంత్ర్యోద్యమం దాదాపు 25 సంవత్సరాల వెనుకకు వెళ్ళిపోయింది. అదీ సరైన స్వచ్ఛమైన మార్గాన్ని అంటిపెట్టుకోవడం అంటే. రాజీపడకుండా, అకుంఠిత దీక్షతో, పట్టుదలతో ఉత్తమమైన మార్గాన్ని అంటిపెట్టుకోవడం, ఇదీ నాకు ఇష్టమైనది.

## ఆచారాలు - సాంప్రదాయాలు మార్చి *2015*

**భక్తుడు:** గురువుగారూ! పూజ అంటే ఏమిటి?

**గురువుగారు:** మీ ప్రేమను వ్యక్తం చేయడానికి మీరు చేసే పని ఏదైనా సరే – అదే పూజ, అదే ఆరాధన.



**భక్తుడు:** గురువుగారూ! నేను ఈ మధ్య మా దేశానికి (ఇంటికి) వెళ్ళినప్పుడు, మా చిన్నతనంలో నేను మా కుటుంబంతో కలసి వెళ్ళే ప్రార్థనా మందిరానికి (సినెగాగ్ – యూదుల ప్రార్థనాస్థలం) వెళ్ళాను. నాకు అక్కడ జరిగే పూజాకార్యక్రమాలలో ప్రేమ లోపించినట్లుగా అనిపించింది. కొంతమంది ఆ పూజావిధులను ఒక తంతులాగా, ఏదో చెయ్యాలి కాబట్టి చేస్తున్నట్లుగా అనిపించింది.

**గురువుగారు:** కాలక్రమంలో బాహ్యాచార వ్యవహారాలు అలా మారిపోతాయి, కేవలం ఒక్క యూదు సాంప్రదాయంలోనే కాదు, అన్ని మతాలలోనూ ఇది జరుగుతుంది. ఈ ఆచార వ్యవహారాలు ప్రారంభంలో అర్థవంతంగా ఉండేవి. కానీ కాలక్రమేణా వాటి అర్థం లుప్తమయ్యి కేవలం యాంత్రికంగా, నిర్జీవంగా మారిపోయాయి. వాటిలో జవసత్వాలు నింపడానికి మహాత్ములు ఉద్భవిస్తారు. “నేను వచ్చింది సనాతన ధర్మాన్ని ధ్వంసం చేయడానికి కాదు, దానిని పరిపూర్ణం చేయడానికే” అని ఏసుక్రీస్తు ప్రకటించింది దీని గురించే. యూదు సాంప్రదాయాన్ని ఏసుక్రీస్తు వ్యతిరేకించలేదు. ఆ సాంప్రదాయం కేవలం తంతులాగా మారింది కాబట్టి దానిని ప్రేమతో నింపి, అర్థవంతంగా మార్చాలని ఆయన అనుకున్నారు. దాంతో క్రైస్తవ మతం అనే మరో మత సాంప్రదాయం మొదలయ్యింది. కొంతకాలానికి అది కూడా తంతులతో నిండిపోయింది. కాలానుగుణంగా ఈ




మార్గమవుతుంది.

**గురువుగారు:** సాధారణంగా నా చుట్టూ జరిగే కార్యక్రమాల నిర్వహణా విషయాలలో నా జోక్యం ఉండదు. ఎవరైనా ఏదైనా సక్రమంగా జరగడంలేదనే విషయాన్ని నా వద్దకు తీసుకువస్తే తప్ప నేను కలుగచేసుకోను. ఎవరైనా అపసవ్యమైన పద్ధతులలో చేస్తున్నారని తెలిస్తే మాత్రం ఆ కార్యక్రమాన్ని లేదా ఆ పనిని పూర్తిగా నిలిపివేసిన విషయాలు కూడా చాలామందికి తెలుసు. నేను ఇటువంటి నిర్ణయాలు తీసుకున్నపుడు ఆ నిర్ణయాలు సాధారణంగా ఎవ్వరికీ నచ్చవు.

నేను ఎక్కువగా మహాత్మాగాంధీ ఆచరించిన పద్ధతులు గురించి చెబుతుంటాను. 1921వ సం॥లో సహాయనిరాకరణోద్యమం విజయవంతంగా జరుగుతోంది. సహాయనిరాకరణోద్యమం అహింసాయుతంగా జరగాలని గాంధీ పిలుపునిచ్చారు. ఎట్టి పరిస్థితులలోనూ హింసకు తావు ఉండకూడదన్నారు. సువిశాల భారతదేశంలో ప్రతిచోటా ఈ ఉద్యమానికి అద్భుతమైన స్పందన వచ్చింది. అందరూ కొన్ని రోజులలోనో లేక వారాలలోనో స్వాతంత్ర్యం రావడం తథ్యమనుకున్నారు. ఇటువంటి పరిస్థితులలో పంజాబ్‌లోని చౌరీచౌరా అనే చిన్న గ్రామంలో కొంతమంది గ్రామస్థులు పోలీసుల దౌర్జన్యాన్ని సహించలేక తిరగబడ్డారు. వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌మీద దాడిచేసి దాన్ని తగులబెట్టారు. ఇంత పెద్ద దేశంలో కేవలం ఒక్క గ్రామంలోనే ఈ సంఘటన జరిగింది. వాళ్ళు హింసను ప్రతిహింసద్వారా ప్రతిఘటించారు. ఈ సంఘటనకు నేపథ్యం చాలా పరిమితమైనది. గాంధీజీ మొత్తం ఉద్యమాన్నే నిలిపివేయడానికి ఈ చిన్న సంఘటనే కారణమైంది. **"స్వాతంత్ర్యానికి మీరు ఇంకా సిద్ధం కాలేదు"** అని గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీతో సహా మిగతా రాజకీయ పార్టీలన్నీ కూడా గాంధీజీని విమర్శించాయి. అంతటి ఉధృతమైన ఉద్యమాన్ని, భావోద్వేగాన్ని మళ్ళీ తీసుకురావడం చాలా కష్టం కాబట్టి, సహాయనిరాకరణోద్యమాన్ని ఆపివేయడం మహాత్మాగాంధీ చేసిన రాజకీయ తప్పిదమని అన్నారు. సహాయనిరాకరణోద్యమం పతాకస్థాయిలో ఉన్నప్పుడు దానిని ఆపడం తప్పు అన్నారు. 'హిమాలయమంత తప్పిదం' (హిమాలయన్ బ్లండర్) ఇదీ వాళ్ళు వాడిన పదం. మొత్తం కాంగ్రెస్‌పార్టీ, జాతీయ నాయకులు అందరూ దానిని వ్యతిరేకించారు. ప్రజలను కూడా ఉద్యమాన్ని ఆపవద్దని అన్నారు. కానీ గాంధీజీ ఒక్కరే ఉద్యమాన్ని ఆపేయమన్నారు. ప్రజలు గాంధీ మాటను అనుసరించి ఉద్యమాన్ని ఆపివేసారు. ఆ ఉద్యమం ఇంకో వారం కొనసాగిఉంటే స్వాతంత్ర్యం అప్పుడే వచ్చి ఉండేదేమో, ఎవరికి తెలుసు? కానీ గాంధీ ఈ ఒక్క విషయాన్ని మన్నించి, రాజీపడి ఉంటే ఇలాంటి హింసాత్మక సంఘటనలు మరెన్నో జరిగేవి. ఎవరైనా ఒకసారి రాజీపడి






ప్రవాహతత్వానికి ప్రతీక. సకల తీర్థాలు మహాత్ముని పాదాల చెంతనే ఉంటాయని శాస్త్రాలు పేర్కొంటాయి.

**భక్తుడు:** గురువుగారూ! నేను నిరంతరం ప్రవహించే గంగానదిని చూస్తూ ఉన్నప్పుడు, చైతన్యం యొక్క స్వభావాన్ని ప్రతిబింబించే ఏదో నిశ్చలత్వాన్ని అనుభవిస్తున్నాను. ఆ విధంగా నాలోని భావోద్వేగాలన్నీ సమన్వయపడి ఒకరకమైన శాంతి అనుభవమవుతోంది. మేము టి.వి. చూస్తున్నప్పుడు ఇలాంటి అనుభవం ఎందుకని కలగడం లేదు?

**గురువుగారు:** మీరు టి.వి. చూస్తున్నప్పుడు కొన్ని పాత్రలతో తాదాత్మ్యం చెందుతారు కాబట్టి అలాంటి అనుభవం కలడగం లేదు. మీరు నదీప్రవాహాన్ని చూస్తున్నప్పుడు, మీరు ఆ ప్రవాహంలో ఒక్కటవుతారు. అది మీ స్వభావాన్ని ప్రతిబింబిస్తుంది. టి.వి. విషయంలో అది మనకు అద్దంలాగా పనిచేయదు. మీరు సినిమా చూస్తున్నప్పుడు మీరు రకరకాల పాత్రలు ధరిస్తారు. దానివల్ల మీలో కొన్ని జ్ఞాపకాలు గానీ లేదా వాటికి సంబంధించిన విషయాలుగానీ గుర్తుకువస్తాయి. సాధారణ జీవితంలోలాగే చైతన్యం తనను తాను కోల్పోయి రకరకాల పాత్రలను ధరిస్తుంది. చాలామంది టి.వి. చూడటానికి కారణం వారికి వారి రోజువారీ జీవితంలో వారికి కావలసినన్ని విభిన్నమైన అనుభవాలు దొరకకపోవడంతో తోచక టి.వి.లు పెట్టుకొని చూస్తుంటారు.

గంగా ప్రవాహాన్ని చూడటం బాబాను చూడటంలాంటిది. ప్రవహించే నదిలాగా సద్గురువు ఎప్పుడూ క్రొత్తగా కనిపిస్తారు. అదే సమయంలో ఆయన రూపం స్థిరంగా ఉంటుంది. ఆయన రూపం ఎంత మనోహరంగా ఉంటుందంటే మనస్సు తనను తాను మర్చిపోయి ఆ రూపంలో లీనమవుతుంది. అది సాధారణంగా మనకు కనిపించే రమణీయత కాదు. ఆయన రూపంలో గంగా ప్రవాహం వంటి క్రియాత్మకమైన సూత్రం ఉంటుంది. కాబట్టి ప్రతిసారీ ఆయన క్రొత్తగా ఉంటారు. మనం ఆయనను చూడటం అదే తొలిసారి అన్నట్లుగా ఉంటుంది. అందువల్ల అది మనల్ని గతకాలపు జ్ఞాపకాలు, భవిష్యత్ ప్రణాళికలు, ఆలోచనలు లేకుండా ఎల్లప్పుడూ వర్తమానంలో ఉండేట్లు చేస్తుంది. ఆయన మీ చైతన్యంలోని క్రియాశీల చలనతత్వాన్ని ప్రతిబింబిస్తారు. మీరు తత్వంతో ఒక్కటవుతారు.

**గురువుగారు:** బాబా వీచే గాలిలాంటివారు. ఒక గదిలో కిటికీ తలుపులన్నీ వేసేసి గాలి నిశ్చలంగా ఉంటే, మనం, "అసలు గదిలో గాలే లేదు" అంటాము. నిజానికి అది వాస్తవం కాదు. గాలి ఉంది. గాలి అంతా వ్యాపించి ఉంది. కాబట్టే మనం జీవించి ఉన్నాము. మరి గాలి లేదని ఎందుకంటాము? ఎందుకంటే గాలి వీయడం మనకు అనుభవం కావడంలేదు కాబట్టి మనకు దాదాపు ఊపిరి

ఆడనట్లుగా ఉంటుంది. మనం కిటికీ తలుపు తీయగానే గాలి తగులుతుంది. అప్పుడు మనం, "హమ్మయ్య, ఇప్పుడు గాలి వస్తోంది!" అంటాము. గాలి వీయడం అనేది మన ఆత్మ చరించడం వంటిది, ఆ కదలిక లేకపోతే ఆత్మను అనుభూతి చెందడం కష్టం.

**భక్తుడు :** గురువుగారూ! నేను గంగ ఒడ్డున కూర్చున్నప్పుడు నా మనస్సు ప్రశాంతమవుతుంది. ఆలోచనలు కాస్త తగ్గుతాయి. కానీ నేను ఆ ప్రవాహతత్వంతో మమేకం కాలేకపోతున్నాను.

**గురువుగారు :** మనం ఇప్పుడు గంగకు దగ్గరగా ఉన్నాం కాబట్టి నేను నదిని ఉదాహరణగా చెప్పాను. చాలామందికి అది అలా అనుభవమవుతుంది, అది వారికి ఉపయోగపడవచ్చు. అంతేగానీ ప్రతి ఒక్కరూ వెళ్లి దానిని సాధన చెయ్యాలని కాదు. నేను దానిని ఒక సాధనగా చెప్పలేదు. మీలో కొందరికి అటువంటి అనుభవం కలిగింది కాబట్టి దాని గురించి ప్రస్తావించాను. అది మీకు అలా అనిపించకపోతే ఆ విషయాన్ని వదిలేయండి, మీరు మరోదానిని ఎంచుకోండి.

మీ అనుభవం సంతోషంగా, ఆనందంగా, మనోహరంగా ఉండి అలా గంటల తరబడి కూర్చోవాలనుకున్నప్పుడు, అప్పుడు నేను చెప్పినట్లు – మీరు గంగను మర్చిపోతారు, నీళ్ళను మర్చిపోతారు. మీ మనసును మర్చిపోతారు. నేను చెప్పిన మాటలు మర్చిపోతారు, ఏమీ మిగలదు. అది సరైన అనుభవం. మీరు గంగ ఒడ్డున కూర్చుని, "గురువుగారు చెప్పింది అది" అనుకొని, దానిని నేను చెప్పినదానితో పోల్చి చూడటానికి ప్రయత్నిస్తూ ఉంటే మీరు అసలు విషయం మర్చిపోయినట్లే. అది సహజంగా, అప్పటికప్పుడు సంభవమయ్యే అనుభవం కావాలి. అది ఓ ప్రయత్నంగానో లేక సాధనగానో కాకూడదు. కొంతమందికి అటువంటి అనుభవం వచ్చింది. "ఆ అనుభవం ఎలా ఉంటుంది?" అని వాళ్ళు అడిగారు. అందుకనే నేను దానికి కాస్త ఎక్కువగా వివరణనిచ్చాను. అంటే, ఆ కథ అక్కడితో ముగిసిపోయింది. (గురువుగారు నవ్వుతూ...) అంతేగానీ నేను చెప్పింది గంగాప్రవాహ ఉపదేశమో, గంగా సూత్రమో కాదు! (నవ్వులు...) అది అటువంటిది కాదు.

**భక్తుడు :** గురువుగారూ! గంగా ప్రవాహాన్ని చూస్తున్నప్పుడు ఒకవేళ మాకు ప్రతిదీ ప్రవాహస్వరూపమనే అనుభవం కలిగితే ఆ అనుభవం అలాగే కొనసాగుతుందా లేక ఆ అనుభవం క్షణమాత్రంగానే ఉంటుందా?

**గురువుగారు :** అది ఆ క్షణంలో మాత్రమే ఉంటుంది. అది కేవలం ఆ క్షణంలోనే ఉన్నప్పటికీ, ఆ అనుభవం మరిన్ని అనుభవాలకు దారితీయవచ్చు. ఆ ప్రవాహతత్వాన్ని మీరు రకరకాల ప్రదేశాలలో,



ఆయనను అలా చేయవద్దని ఎందుకన్నారు?

**గురువుగారు :** బాబా అక్కడ చెప్పింది మసీదుకు చేరుకునే దగ్గరదారి గురించి కాదు. బాబా, ఆధ్యాత్మిక మార్గంలో చాలామంది ఎంచుకునే అడ్డదారుల (దగ్గరదారుల) గురించి చెప్పారు. సాధారణంగా ఆధ్యాత్మిక శ్రేణులలో, సంస్థలలో, "మన ఉద్దేశ్యాలు సరైనవి అయినప్పుడు, ఆశయాలు మంచివైనప్పుడు తమ లక్ష్యం ఉన్నతమైనది కాబట్టి దానిని చేరుకోవడానికి ఎలాంటి మార్గమైనా ఎంచుకోవచ్చు అనుకుంటారు. మనం మన వాళ్ళను బాగా ఉపయోగించుకుందాం, మనం ఎలాగైనా డబ్బులు ప్రోగేద్దాం, మనం ఎలాగూ వాటిని బాబా గురించి పదిమందికీ తెలియచేయడానికే కదా వాడుతున్నాం" అనుకుంటారు. కొన్ని సంస్థలు తమ లక్ష్యాలు ఉన్నతమైనవి కాబట్టి వాటిని సాధించడానికి తమకు నచ్చిన ఎటువంటి మార్గాన్నైనా ఎంచుకోవచ్చని తమను తాము నమ్మించుకుంటారు. వాళ్ళకు వారి లక్ష్యమే ముఖ్యం, ఆ లక్ష్యానికి చేరుకునేందుకు వెళ్ళే మార్గం వారికి ముఖ్యం కాదు.

కానీ సమస్యేమిటంటే లక్ష్యం ఎప్పుడూ అస్పష్టంగానే ఉంటుంది. వారికి మంచి జరుగుతుందా లేదా, వారు ఆ డబ్బులను బాబా ప్రచారానికి సరిగా ఖర్చు చెయ్యగలుగుతారా అనే విషయం స్పష్టంగా వారికి తెలియదు. అది అస్పష్టం. మన చేతుల్లో ఉన్నది కేవలం మార్గం మాత్రమే. అది స్పష్టంగా ఉంటుంది. మనం లక్ష్యాన్ని త్వరగా చేరినా, చేరకపోయినా మనం మన మార్గం విషయంలో ఎప్పుడూ జాగ్రత్తగానే ఉండాలి. లక్ష్యం కన్నా మార్గమే ముఖ్యమైనది. మనకు ఉన్నతమైన లక్ష్యం ఉండాలి కానీ, ఉన్నతమైన లక్ష్యాన్ని సాధించడానికి సవ్యమైన, ఉన్నతమైన మార్గాన్ని త్యాగం చేయకూడదు. ఒక ఉన్నతమైన లక్ష్యాన్ని అపసవ్యమైన మార్గాలలో చేరుకోలేము. మన లక్ష్యం ఏదైనా సరే దానిని చేరుకోవడానికి మనం ఎంచుకునే మార్గం స్వచ్ఛంగా ఉండాలి. మనం మన లక్ష్యాన్ని చేరుకుంటామా లేదా అన్నది ముఖ్యం కాదు. మన మార్గం మంచిదైనపుడు మనం లక్ష్యసాధనలో ఎప్పుడూ సరైన దారిలోనే ఉంటాం. విషయం మనకు స్పష్టంగా అనుభవమైనా, కాకపోయినా దానిని పట్టించుకోవలసిన అవసరం లేదు.

నిజానికి అక్కడ మనం ఒకచోటు నుండి మరోచోటుకు ప్రయాణం చేయడం లేదు. మనం ఎక్కడున్నామో అక్కడ వృత్తాకారంలో పరిభ్రమిస్తూ పరివర్తన చెందడం వంటిది. మనం ఉన్నతమైన మార్గాన్ని, స్వచ్ఛమైన మార్గాన్ని, నిజాయితీతో కూడిన మార్గాన్ని అంటిపెట్టుకోవడానికి ప్రయత్నించడం ద్వారా మన లక్ష్యం మనకు ఏ క్షణంలోనైనా ప్రత్యక్షమయ్యేలా చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నాము. ఆ ప్రయత్నంలో మనం విజయం సాధించినపుడు మన మార్గమే గమ్యమవుతుంది. గమ్యమే

మనకు మంచి చేస్తుందని భావిస్తాం. కానీ వాటిని నిజంగా కావాలనుకోము. ఉదాహరణకు, ముక్తి, మోక్షం... ఇలాంటి సిద్ధాంతాలు. వీటిని తలకెక్కించుకొని రోజుకు ఆరుగంటలపాటు ధ్యానంలో కూర్చుని ఆత్మవిచారణ చెయ్యాలనో, జపం చెయ్యాలనో, మరేదో చెయ్యాలనో అనుకుంటాం. అది మంచిదే. కానీ మనం అలా కూర్చోగలుగుతున్నామా? మనం ఎంతో దూరం నుండి ఆత్మవిచారణ చెయ్యడానికి తిరువణ్ణామలై వచ్చాం. మీకు మీరే లెక్కపెట్టుకోండి, ఎన్నిగంటలు–గంటలు అంటే చాలా ఎక్కువేమో (నవ్వులు...) ఎన్ని నిమిషాలు మీరు ఆత్మవిచారణ చేస్తున్నారు?

అది మీకు అవసరం లేదని నేను చెప్పడం లేదు – అది మీకు కావాలి, కేవలం సిద్ధాంతపరంగా మాత్రమే కావాలి. ఇది కాకుండా మీకు కావలసినవి ఇంకా వేరే ఉన్నాయి. మీకు నిజంగా ఆత్మ విచారణ అవసరమా? ముందు మీకు నిజంగా ఏమి కావాలో తెలుసుకోండి. అలా చేయడం వలన ఒకరకంగా మీ గురించి మీరు తెలుసుకోగలుగుతారు. అలా తెలుసుకున్నప్పుడు మీ వ్యక్తిత్వం గురించిన వాస్తవం మీకు అనుభవంలోనికి వస్తుంది. అది ఒక్కసారి మీకు అనుభవమయ్యాక, మీరు దానిని అంగీకరించాక మీరు అక్కడ నుండి మొదలుపెట్టవచ్చు.

మీ బుర్రలను వివిధ రకాల పదజాలంతో, సిద్ధాంతాలతో, ఊహలతో నింపుకోవద్దు. ముందు మీకు ఏం కావాలో తెలుసుకోండి. తరువాత దానిని సాధించే పద్ధతిని కనుక్కోండి. అది విశ్వసనీయమైన పద్ధతా? ఈ పద్ధతిలో ఎవరైనా ఇంతకుముందు ప్రయత్నించి విజయం సాధించారా? వాళ్ళు ఏదైతే పొందారో మీకూ నిజంగా అదే కావాలా? – సాధనలో విశ్లేషణంటూ అవసరమైతే మనం చేసుకోవలసిన ‘విశ్లేషణ’ ఇది. బ్రహ్మం మొదలైన సిద్ధాంతాల గురించి మాట్లాడుకోవడం విశ్లేషణ కాదు. అది కేవలం ‘చర్చ’ మాత్రమే. మనకు ఏ మాత్రం అంతుబట్టని విషయాల గురించిన చర్చ. మీ అంతరంగాన్ని మీరు తరచి తరచి చూసుకోండి. అక్కడ ఆత్మ ఉందో, బ్రహ్మం ఉందో లేదో మరేదైనా ఉందో తెలుస్తుంది. మీకు అవసరమైనది ఏమిటో మీకు తెలుస్తుంది. మీకు ఏమి అవసరమో మీకు తెలిసి ఉంటే, మీ అంతట మీరే, సహజసిద్ధంగానే దానిని పొందే మార్గాన్ని తెలుసుకోగలుగుతారు. అది చాలా సహజంగా జరుగుతుంది.

**భక్తుడు:** గురువుగారూ! ఒకసారి గంగగిర్ మహరాజ్ బాబాను దర్శించుకోవడానికి మసీదుకు ఒక దగ్గర దారిలో వచ్చారని, అప్పుడు బాబా వారిని వారించి, “ఇలా దగ్గర దారిలో రావద్దు, సాధారణంగా వచ్చే ప్రధానమార్గంలోనే రమ్మ”ని చెప్పారని చదివాను. గంగగిర్ మహరాజ్ బాబాను దర్శించుకోవాలనే ఆతృతతోనే కదా అలా దగ్గర దారిలో మసీదుకు వచ్చారు – అందులో తప్పేముంది? బాబా






రకరకాల అంశాలలో, మీ ఊహకు కూడా అందని చోట అనుభూతి చెందడం ప్రారంభిస్తారు. ఈ విశ్వంలో ప్రతిదీ చరిస్తూనే ఉంది, కేవలం గంగ మాత్రమే కాదు, మీరు ఆ స్థితిని రుచిచూడటం ప్రారంభిస్తారు. అదే అనుభవం నిరంతరం కొనసాగుతుందని, దానిని మీరు తరువాత నెమరువేసుకోవాలని కాదు. ప్రతి అనుభవాన్ని ఆ క్షణంలో క్రొత్తగా తీసుకోండి. దానిని అలాగే సాగిపోనివ్వండి.

## మనకేం కావాలి? ఫిబ్రవరి 2015

**భక్తుడు:** గురువుగారూ! అమెరికాలో కుటుంబంతో నివసించడం, అక్కడ నా ఉద్యోగపరమైన బాధ్యతల వల్ల నేను మీతో ఉండే ఎన్నో అవకాశాలను కోల్పోతున్నట్లు అనిపిస్తుంది. ఇలా ఉంటే నేను నా ఆధ్యాత్మిక లక్ష్యాన్ని సాధించలేనేమో అని భయంగా ఉంది.



**గురువుగారు:** నాకు ఇరవైనాలుగు గంటలూ దగ్గరగా ఉండే వాళ్లంతా గొప్పవాళ్లని, దూరంగా ఉన్న మీరేదో కోల్పోతున్నారని అనుకోవద్దు. మీరేమీ కోల్పోవడం లేదు. కోల్పోతే ఇక్కడుండేవాళ్ళే ఏదైనా కోల్పోతున్నారేమో. (గురువుగారు నవ్వుతూ..) బాబా మీ అవసరాలు తీరుస్తూనే ఉన్నారు కదా, సమయం వచ్చినప్పుడు ఈ అవసరం తీరే మార్గం కూడా బాబానే చూపిస్తారు. “నా భక్తులను పతనం కానివ్వను” అన్నారు బాబా. బాబా చెప్పిందే శాసనం. అది జరిగి తీరుతుంది. మనమంతా ఆయన భక్తులం, మనం భయపడవలసిన అవసరం లేదు. అర్హతానర్హతలంటూ ఏమీ లేవు. నిజానికి చెప్పాలంటే మనమంతా యోగ్యత లేనివాళ్లమే, బాబానే మనకు ఆ యోగ్యతనిస్తారు. మనమంతా కాగితపు ముక్కలలాంటి వాళ్ళం. బాబాఅనుగ్రహమనేది రిజర్వుబ్యాంక్ గవర్నర్ సంతకం వంటిది. ఆ సంతకం ఈ కాగితాలను కరెన్సీ నోట్లుగా మారుస్తుంది. కానీ సమస్యేమిటంటే ఈ కాగితమంతా సిరా మరకలతో అలికేసి ఉంది (నవ్వులు) బాబా దాని మీద సంతకం చేసినప్పటికీ ఆ సంతకం మనకు కనిపించడం లేదు. ఆ కాగితాన్ని కాస్త తెల్లగా చేసుకుని, బాబా సంతకం పెట్టడానికి తగిన ఖాళీని సిద్ధం చేసుకోవడమే మనం ఇప్పుడు చేసేది.

చిన్న చిన్న విషయాలను కూడా తెగ పట్టించుకుంటూ, ఎప్పుడూ వాటి గురించే పదే పదే ఆలోచించే వాళ్ళను చూస్తే నాకు చాలా ఆశ్చర్యం వేస్తుంది. ఆమె నాతో ఇలా మాట్లాడింది,




ఈయన నాతో అలా ప్రవర్తించాడు, ఆమె నాకు హలో చెప్పలేదు, ఇతను నన్ను పట్టించుకోలేదు... ఇలాంటి విషయాలు. అయితే ఏంటట? నువ్వు అంతదూరం నుండి వచ్చింది ఫలానా ఫ్రెండుతో 'హలో' చెప్పించుకోవడానికేనా? (గురువుగారు నవ్వుతూ..) మీ ఆలోచనలు ఎలా ఉన్నాయో ఒక్కసారి చూడండి! కనీసం మీరు నాతో కూర్చునే పది, పదిహేను నిమిషాలు – మీరు మౌనంగా ఉండాలనుకుంటున్న ఈ కొద్ది సమయమైనా – మీరు నిజంగా మౌనంగా ఉంటున్నారా?

మనం ఇలా ఈ పరిస్థితిలో ఉండటానికి కారణం ఏమిటి? ఎందుకంటే మీరు మూడు విషయాలను మర్చిపోతున్నారు. **ఎందుకు, ఏమిటి, ఎలా!** ఈ మూడు అంశాల సూత్రాన్ని మీరు గుర్తుపెట్టుకోండి. ఇంకేమీ అక్కరలేదు. మనం ఇక్కడ 'ఎందుకు'న్నాం? మనం చెయ్యాల్సిన పను'లేమిటి'? చెయ్యకూడని పనులేంటి? మనం వాటిని 'ఎలా' చేస్తున్నాం? మనం సరిగా చేస్తున్నామా, లేదా అన్న విషయం మనకు వేరెవరో చెప్పనక్కరలేదు. ఇక్కడ పరీక్షలేమీ ఉండవు. మీరు సాధించిన ఫలితాలను సరిచూడటానికి వేరేవాళ్లు ఎవరూ ఉండరు. మీ గురించిన వాస్తవాన్ని మీకు తెలియచేయడానికి మీరు మీ రోజును ఎలా గడుపుతున్నారు అన్న ఒక్క విషయం చాలు. ఇక్కడ మిమ్మల్ని పరీక్షించుకునేది మీరే!

**గురువుగారు:** మనకేం కావాలి, మన గమ్యం ఏమిటి, మన జీవిత లక్ష్యం ఏమిటి అనే విషయాల పట్ల మనకు స్పష్టత ఉండాలి. తర్వాత ఒకవేళ ఎప్పుడైనా మన లక్ష్యం మారితే మార్చుకోవచ్చుకానీ ఇప్పుడు మనకు ఏం కావాలి అనే విషయం పట్లయినా స్పష్టమైన అవగాహన ఉండాలి. అప్పుడు మనం ఏమి చేసినా, మనం సాధించింది కొంత మాత్రమే అయినా మనకు ఆ సంతృప్తి, ఆనందం ఉంటాయి. లేకపోతే మనం చేసేదంతా తంతుగా (యాంత్రికంగా), అలవాటుగా మారుతుంది. ప్రపంచమంతా ఇలాగే నడుస్తుంది యాంత్రికంగా.

ఒక వ్యక్తిని సాధకునిగా మార్చేది ఏమిటి? అతను గురువును పట్టుకుని ఉంటాడా లేక ఇరవై నాలుగు గంటలూ సాధన చేస్తాడా లేదా యోగం చేస్తాడా, ఇవి కాదు. ఒక వ్యక్తి సాధకుడు అని చెప్పడానికి ఇవి గీటురాళ్ళు కాదు. **తన లక్ష్యం పట్ల స్పష్టత ఉన్నవాడే సాధకుడు.** మీరు, మాకు పరిపూర్ణమైన ఆనందం కావాలి అంటున్నారు, అలా అయినప్పుడు మీకు ఆ పరిపూర్ణానందాన్ని ఇచ్చేది ఏమిటో అన్వేషించండి.

**భక్తుడు:** గురువుగారూ! మన లక్ష్యం ఏమిటి, మన మౌలికమైన అవసరం ఏమిటి అని తెలుసుకోవడం ఎలా?






**గురువుగారు:** అది ప్రతి ఒక్కరూ ఎవరికివారు అన్వేషించుకోవాలి. మీకు నిజంగా ఏమి కావాలి, దానిని మీరు పొందడానికి సహాయం చేసేది ఏమిటి అనే విషయాలను మీరే అన్వేషించుకుని అనుభవంలోనికి తెచ్చుకోవాలి. దాని గురించి ఆలోచించండి మీకు తెలుస్తుంది. మీకు నిజంగా తెలుసుకోవాలనే అవసరం ఉంటే మీరు అన్వేషిస్తారు. మీరు నిజంగా (జబ్బుతో) బాధపడుతూ ఉంటే మీరే మంచి డాక్టరును వెతుక్కుంటూ వెళ్లి, చికిత్స చేయించుకుంటారు. హోమియోపతి, ఆయుర్వేదం లేదా మరేదానినో ప్రయత్నిస్తారు. మీకు నిజంగా అంత బాధ లేకపోతే మీరు డాక్టరు కోసం వెతకరు. మనకు నిజంగా ఏమి కావాలో మనకు తెలియక పోవచ్చు. కానీ దానిని తెలుసుకోవడమే మన జీవితలక్ష్యం. అదే మన అన్వేషణ, మన సాధన, మన కృషి యావత్తూ.

**భక్తుడు:** గురువుగారూ! నాలో ఉన్న అడ్డంకులు తొలగించుకుని బాబాకు దగ్గర కావడం ఎలా?

**గురువుగారు:** మీరు నిజంగా బాబాకు దగ్గర కావాలనుకుంటున్నారా? ఒకవేళ నిజంగా అలా అనుకుంటే, మీరు అలా దగ్గర కావడం కోసం ఏమి చేస్తున్నారో చూసుకోండి. మీ ఉద్దేశ్యంలో బాబాకు దగ్గర కావడం అంటే ఏమిటి? బాబా దగ్గర నుండి మీరు ఏమి ఆశిస్తున్నారు? బాబా సన్నిధిని మీరు ఎలా అనుభూతి చెందుతున్నారు? అందుకనే నేను, మీరు ప్రేమించే ఒక లక్ష్యాన్ని, ఒక స్పష్టమైన గమ్యాన్ని పెట్టుకుని మీరు వేసే అడుగులన్నీ దానివైపుకే పడేలా ప్రయత్నించమని చెబుతాను. ఇలాంటి ప్రయత్నం ఆ లక్ష్యానికి చేరువ చేస్తుంది. లేకపోతే మీరు నిలకడ లేకుండా ఉంటారు. అలాగని దీనర్థం నన్నుగానీ, లేదా బాబానుగానీ మీ లక్ష్యంగా పెట్టుకోమని కాదు. మీరు ఏ లక్ష్యాన్నైనా ఎంపిక చేసుకోండి, కానీ దానికి కట్టుబడి ఉండండి. మీ ప్రేమకు కేంద్రంగా ఉన్న విషయాన్ని ఎంచుకోండి. తరువాత ఆ లక్ష్యానికి చేరువ కావడం ఎలా అనే ప్రశ్న వస్తుంది. ఇలా కాకపోతే మీరు ఒక దిశలో నడుస్తున్నామని అనుకుంటూ నిజానికి మరో దిశలో వెళ్లిపోతారు. మీకు నిజంగా ఏమి కావాలో అనే విషయంలో మీకు స్పష్టత లేదు కాబట్టి ఇటువంటి అడ్డంకులు అనుభవమవుతున్నాయి. మీరు బాబాకు దగ్గర కావడాన్ని అనుభవంలోనికి తెచ్చుకోలేకపోతున్నారు.

**భక్తుడు:** గురువుగారూ! మమ్మల్ని రకరకాల ఆకర్షణలు రకరకాల వైపులకు లాగడం వలన మాకు నిజంగా ఏమి కావాలనే విషయాన్ని తెలుసుకోవడం కష్టమవుతోంది.

**గురువుగారు:** మనిషి మనస్సు యొక్క సంక్లిష్టత ఇక్కడే ఉంది. మనకేం కావాలో తెలుసుకోవడం ఎందుకంత కష్టమవుతుందంటే, మనకు కావాల్సింది చాలా విషయాలతో ఇమిడి ఉంటుంది. మనం కొన్ని విషయాలను ఒక సిద్ధాంతపరంగా మాత్రమే కావాలని కోరుకుంటాము. వాటిని పొందడం